ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 19 జనవరి 2025





సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ. పక్కన ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, సుందరపు విజయకుమార్ తదితరులు

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

» వాడవాడలా వర్ధంతి కార్యక్రమాలు

టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని శనివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. వాడవాడలా ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, వెన్నెలపాలెంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, చోడవరంలో స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మునగపాక మండలం గణపర్తిలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొన్నారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పీలా గోవింద, బుద్ద నాగజగదీశ్వరరావు, బత్తుల తాతయ్యబాబు

సొంత గనులు కూడా సాధిస్తాం

» జనసేన ఎమ్మెల్యేలు కొణతాల, పంచకర్ల, వంశీకృష్ణ, సుందరపు
» స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ సాధనలో పవన్ కల్యాణ్‌ది కీలక పాత్ర
» జనసేన పార్టీ కార్యాలయంలో సంబరాలు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):
ఉక్కు కర్మాగారానికి కేంద్రం ప్రభుత్వం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం వెనుక జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చాలా ఉందని ఆ పార్టీ ఎమ్మెల్యేలు వెల్లడించారు. ఇదే పట్టుదలతో స్టీల్ ప్లాంటుకు సొంత ఐరన్‌ఓర్ గనులు కూడా సాధిస్తామని ప్రకటించారు. కేంద్రం సాయం ప్రకటించిన నేపథ్యంలో శనివారం సీతంపేటలోని పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద పరిశ్రమగా గుర్తింపు పొందిన విశాఖ ఉక్కును కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే ప్రధాని మోదీ ... మిగతా 8వ పేజీలో

ప్రొటోకాల్‌పై జడ్పీలో రగడ

అభివృద్ధి పనులకు జడ్పీటీసీ సభ్యులను ఆహ్వానించడం లేదని ఆరోపణ

» అధికారులు సమాచారం ఇవ్వాలని చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశం
» ఎలమంచిలిలో పనులు ప్రారంభించకుంటే పీఆర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరిక
» అతిథి గృహాల మరమ్మతులకు ప్రతిపాదనలు



ప్రొటోకాల్ వివాదంపై టీడీపీ, వైసీపీ జడ్పీటీసీ సభ్యుల వాగ్వాదం

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):
ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వం మంజూరుచేసిన నిధులతో చేపట్టే పనుల శంకుస్థాపనలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని అరకు ఎమ్మెల్యే రేగా మత్స్యలింగం, పలువురు వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఆరోపించారు. ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించాల్సిన అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. దీనిపై టీడీపీకి చెందిన నర్సీపట్నం జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇదే సమస్య ఉందని అనగానే పెదబయలు జడ్పీటీసీ సభ్యుడు బొంజబాబు, ఇతర సభ్యులు ఆమెతో వాగ్వాదానికి దిగారు. బడ్జెట్ ఆమోదం కోసం శనివారం చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో అరకు ఎమ్మెల్యే రేగా మత్స్యలింగం మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులకు తనకు ఆహ్వానం లేదని, ఈ విధానం మంచిదికాదన్నారు. వెంటనే చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని పనులు ప్రారంభించిన అధికారులు సమాధానం చెప్పాలని ఆదేశించగా, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ ఈఈ, ఇతర అధికారులు రాలేదని సీఈవో నారాయణమూర్తి చెప్పారు. తరువాత సుభద్ర మాట్లాడుతూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందర్భంలో రాజకీయాలు అక్కర్లేదని అనగానే పలువురు వైసీపీ సభ్యులు లేచి జిల్లాలో పలుచోట్ల రోడ్లు, ఇతర పనుల శంకుస్థాపనలకు తమకు ఆహ్వానం లేదని ఫిర్యాదు చేశారు. అధికారులు ప్రజా సమస్యలపై అంకితభావంతో పనిచేయాలని సుభద్ర సూచించారు. గొలుగొండ జడ్పీటీసీ సభ్యులు గిరిబాబు మాట్లాడుతూ జడ్పీ నిధులతో పనులు చేపట్టేందుకు అధికారులు సహకరించడంలేదని ఫిర్యాదుచేయగా, చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామ సభ తీర్మానం లేకుండానే పనులు జరుగుతున్నాయని అనంతగిరి, బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యులు డి.గంగరాజు, దొండ రాంబాబు ఆరోపించగా, మరికొందరు సభ్యులు లేచి పనుల విషయం తమకు కనీసం చెప్పడం లేదనగానే చైర్‌పర్సన్ స్పందిస్తూ గ్రామ, మండల, జడ్పీ ఆమోదం లేని పనులు చెల్లవన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలో జడ్పీ నిధులతో ప్రతిపాదించిన పనులు చేపట్టేందుకు అధికారులు వాయిదాలు వేస్తున్నారని మునగపాక, రాంబిల్లి జడ్పీటీసీ సభ్యులు ... మిగతా 8వ పేజీలో

జడ్పీ బడ్జెట్ రూ.1,586.08 కోట్లు

2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను ఆదాయం రూ.1589.13 కోట్లు

» వ్యయం రూ.1586.08 కోట్లు
» మిగులు రూ.3,05,23,400
» ఆమోదం తెలిపిన సర్వసభ సమావేశం



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పక్కన సీఈవో నారాయణమూర్తి

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):
వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) సంబంధించి రూ.1,586.08 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమోదించింది. అలాగే 2024-25 సంవత్సరం సవరణ బడ్జెట్ (రూ.1,360.75 కోట్లు)కు కూడా ఆమోదం తెలిపింది.

చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రస్తుత సంవత్సరానికి గతంలో రూపొందించిన బడ్జెట్‌కు సవరణ, వచ్చే ఆర్థిక సంవత్సరానికి తయారుచేసిన అంచనా బడ్జెట్‌పై చర్చించి ఆమోదం తెలపడం ఆనవాయితీ. దీనిప్రకారం 2024-25 సంవత్సరానికిగాను సవరించిన బడ్జెట్‌లో రూ.1360.75 కోట్లు ఆదాయంగా, రూ.1352.85 కోట్లు వ్యయంగా ... మిగతా 8వ పేజీలో

ఐఎంయూ ఎదుట రైతుల ధర్నా

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్

» భూములు తీసుకున్నప్పుడు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆవేదన



వంగలిలోని మారిటైం వర్సిటీ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

సబ్బవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి):
మండలంలోని వంగలి గ్రామంలో గల ఇండియన్ మారిటైం యూనివర్సిటీ(ఐఎంయూ)లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ భూములు ఇచ్చిన రైతులు శనివారం వర్సిటీ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు, సర్పంచ్ ఆకుల శ్రీహేమ, తదితరులు మాట్లాడుతూ ఐఎంయూలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దడమే కాకుండా తమ గ్రామం మీదుగా రహదారులు నిర్మిస్తామని పదేళ్ల క్రితం భూములు తీసుకున్నారన్నారు. అయితే వర్సిటీ నిర్మాణం పూర్తయి, తరగతులు కూడా నిర్వహించి సుమారు ఆరేళ్లు అవుతున్నా స్థానికులకు ఎటువంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. స్థానికేతరులు అనేక మందికి మాత్రం ఉద్యోగావకాశాలు కల్పించి తమను విస్మరించారన్నారు. అనేక సార్లు ప్రజాప్రతినిధులకు, కలెక్టర్‌కు, వర్సిటీ పెద్దలకు వినతి పత్రాలు ఇచ్చినా, నేరుగా కలిసి వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మన భూమి-మన హక్కు, స్థానికులకే ఉద్యోగాలు ... మిగతా 8వ పేజీలో



ఉత్సవానికి హాజరైన భక్తులు, (ఇన్‌సెట్‌లో) రథంపై గౌరీ పరమేశ్వరులు



వైభవంగా వేల్పులవీధి గౌరమ్మ ఉత్సవం

అనకాపల్లి పట్టణంలో ప్రఖ్యాతిగాంచిన వేల్పులవీధి గౌరీ పరమేశ్వరులు అనుపు మహోత్సవం శనివారం వైభవంగా ప్రారంభమైంది. తెల్లవారుజామున మెయిన్‌రోడ్డులోని ఆలయంలో గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- వార్త 8వ పేజీలో..

రహదారి పనులు చకచకా

జిల్లాలో రూ.11 కోట్లతో 521 కిలో మీటర్ల మేర గోతులు పూడ్చాలని నిర్దేశం

» ఇప్పటి వరకు 346.15 కిలో మీటర్ల మేర పనులు పూర్తి
» నెలాఖరుకు మిగతావి పూర్తి చేయాలని లక్ష్యం



రోలుగుంట మండలం కొమరవోలులో రహదారి పనులు జరుగుతున్న దృశ్యం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)
జిల్లాలో మిషన్ పాత్‌హోల్ ఫ్రీ పథకంలో భాగంగా ఆర్ అండ్ బీ పరిధిలో రోడ్ల మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.11 కోట్ల అంచనా వ్యయంతో 119 పనులను చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్దేశించింది. సుమారు 521 కిలో మీటర్ల మేర రోడ్లపై గోతులు పూడ్చడం, ప్యాచ్ వర్క్ పనులు చేపట్టింది. సంక్రాంతి పండుగకు ముందు వరకు సుమారు 346.15 కిలో మీటర్ల మేర 73 రహదారి పనులు (66.40 శాతం) ఇప్పటికే పూర్తయ్యాయి. అనకాపల్లి, చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాలను కలిపే ఆర్ అండ్ బీ రోడ్లు ఇప్పటికే అందంగా రూపుదిద్దుకున్నాయి.

ఈ నెలాఖరుకు పనులు పూర్తి

తొలుత సంక్రాంతి నాటికి రహదారి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని భావించారు. టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడం, సంక్రాంతి పండుగ సెలవులకు కార్మికులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో పనులు నిలిచిపోయాయి. పండుగ ముగియడంతో శనివారం నుంచి పనులు ఊపందుకున్నాయి. ఈ నెలాఖరులోగా ఇప్పటికే ప్రారంభించిన, మంజూరైన అన్ని పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆర్ అండ్ బీ ఈఈ రమేశ్ తెలిపారు.

కలహాల కాపురాలకు కౌన్సెలింగ్

బీటలు వారుతున్న బంధాలకు రాజీ మంత్రం

» విడిపోవడానికి సిద్ధమైన దంపతులను చర్చల ద్వారా మళ్లీ కలుపుతున్న డొమెస్టిక్ వయోలెన్స్ సెల్ అధికారులు
» కట్నం వేధింపులు, అనుమానాలు, అపోహలతో వచ్చేవారే ఎక్కువ
» కలిసి ఉండేందుకు ఇష్టపడని ఎంతోమంది..
» మాటల ద్వారా మార్పు తెస్తున్న సెల్
» గడిచిన ఏడాది 474 జంటల మధ్య రాజీ




(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
నగర పరిధిలోని గాజువాక ప్రాంతానికి చెందిన యువతికి అనకాపల్లి జిల్లాలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడితో ఏడాది కిందట వివాహం అయింది. యువతి ఉద్యోగం చేస్తుండడంతో నగరంలో నివాసం ఉందామని ముందుగానే చెప్పింది. వివాహమైన తరువాత తమ తల్లిదండ్రుల వద్దే ఉండాలని భర్త వేధిస్తుండడంతో ఆమె గృహ హింసకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించే సెల్ (డొమెస్టిక్ వయోలెన్స్)ను ఆశ్రయించింది. ఇద్దరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరడంతో విడిపోయేందుకు సిద్ధమయ్యారు. ఇరువురికీ సెంటర్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అదేవిధంగా ఇరువైపుల తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడి...సిటీలో నివాసం ఉండేలా, సెలవు రోజుల్లో భార్యాభర్తలు ఇద్దరూ వెళ్లి తల్లిదండ్రు లను చూసుకునేలా ఒప్పించడంతో సమస్య పరిష్కారమైంది.

మధురవాడ ప్రాంతానికి చెందిన మహిళకు ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్త వేధిస్తుండడంతో ఆమె డొమెస్టిక్ వయోలెన్స్ సెల్‌కు ... మిగతా 8వ పేజీలో

వైసీపీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడిగా ధర్మశ్రీ

చోడవరం సమన్వయకర్తగా గుడివాడ అమర్‌నాథ్

» మాడుగులకు బూడి ముత్యాలనాయుడు
» గాజువాకకు తిప్పల దేవన్‌రెడ్డి » భీమిలికి చిన్న శ్రీను



కరణం ధర్మశ్రీ



గుడివాడ అమర్‌నాథ్



బూడి ముత్యాలనాయుడు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):
ఉమ్మడి విశాఖ జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు నియోజకవర్గానికి కొత్త సమన్వయకర్తలను నియమిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకునిగా కరణం ధర్మశ్రీని, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీమంత్రి ... మిగతా 8వ పేజీలో

నేడు ఎలమంచిలిలో కనకమహాలక్ష్మి తీర్థం



విలేకరుల సమావేశంలో ఏర్పాట్లను వివరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ఎలమంచిలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ధర్మవరంలో కనక మహాలక్ష్మి అమ్మవారి తీర్థం ఆదివారం జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొఠారు సాంబ, మడుగుల సత్యనారాయణ, కొఠారు కొండబాబు, నరేష్, పిల్లా రాము విలేకర్లతో మాట్లాడుతూ తీర్థాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఇదిలా వుంటే, విద్యుద్దీప కాంతులతో ఎలమమంచిలి పట్టణం ధగధగలాడుతోంది. ఎటు చూసినా కోలాహలంగా కనిపిస్తోంది. తీర్థం సందర్భంగా జెయింట్‌వీల్ ఆకర్షణగా నిలుస్తోంది. పోలీసులు మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

హరిపాలెం పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



పీహెచ్‌సీ ఆవరణను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

అచ్యుతాపురం రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో పి.రవికుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యాధికారి డాక్టర్ విజయ్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెలుగుజాతి గుండె చప్పుడు ఎన్టీఆర్

▸▸ వర్ధంతి సందర్భంగా కీర్తించిన వక్తలు ▸▸ పలు గ్రామాల్లో విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి



ఎలమంచిలిలోని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు నివాళి



అచ్యుతాపురంలో ప్రగడ నాగేశ్వరరావు, పప్పు చలపతిరావు పేదలకు వస్త్రాల పంపిణీ, చిత్రంలో ధూళి రంగనాయకులు, లాలం భవానీ

ఎలమంచిలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం నియోజవకర్గంలో వాడవాడలా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటుచూసినా కోలాహల వాతావరణం నెలకొంది. ఎలమంచిలిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ నటనతోనే కాకుండా ముఖ్యమంత్రిగా ప్రజారంజక పాలన అందించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, జిల్లా ప్రతినిధి రాజాన సూర్యనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మునిసిపాలిటీ పరిధి పెదపల్లిలో ఎన్టీఆర్ వర్ధంతిని జరిపారు. మాజీ కౌన్సిలర్ బొద్దపు నాగేశ్వరరావు, బొద్దపు శ్రీను, బొద్దపు శ్రీనివాసరావు, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు. ఏటికొప్పాక, కొత్తపాలెం, కృష్ణాపురం, పోతిరెడ్డిపాలెంలలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో నాయకులు కాండ్రకోట చిరంజీవి, పిల్లా ఆదిబాబు, కొలుకులూరి విజయ్‌బాబు, ఇత్తంశెట్టిరాజు, సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. శనివారం అచ్యుతాపురం నాలుగురోడ్ల కూడలిలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ రాష్ట్రానికి అందించిన సేవలను కీర్తించారు. నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు లాలం భవానీ భాస్కర్, కర్రి సాయికృష్ణ, రాజాన రమేష్‌కుమార్, ధూళి రంగనాయకులు, భీమరశెట్టి శ్రీనివాసరావు, లాలం భరత్, ఆడారి మంజు, రాజాన సూర్యనాగేశ్వరరావు, జనపరెడ్డి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, పూడిమడకలో నాయకులు మేరుగు బాపునాయుడు ఆధ్వర్యంలో, తిమ్మరాజుపేటలో కర్రి ఆదిబాబు ఆధ్వర్యంలో, నునపర్తిలో రెడ్డి నగేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు దిన్‌బాబు, జనసేన నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి రామదాసు, ద్వారపురెడ్డి బాబూజీ, తదితరులు పాల్గొన్నారు.



మునగపాక మండలం గణపర్తిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక : సినీ, రాజకీయ రంగాల్లో అద్భుతంగా రాణించి తనదైన ముద్ర వేసుకున్న మహోన్నతుడు ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. గణపర్తి, చూచుకొండ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరై ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి ఎన్టీఆర్ అందించిన సేవలను కొనియాడారు. మునగపాక, తిమ్మరాజుపేట గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు ప్రగడ నాగేశ్వరరావు హాజరైన ఎన్టీఆర్ సాధించిన ఘనకీర్తిని వివరించారు. అలాగే, మునగపాకలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పెంటకోట విజయ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. నాగులాపల్లి, గవర్ల అనకాపల్లి, వాడ్రాపల్లి, టి.సిరసపల్లి, మంగళవరపుపేట తదితర గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, కూటమి నాయకులు కర్రి సాయికృష్ణ, బద్దెం సూర్యనారాయణ, దొడ్డి శ్రీనువాసరావు, కొయిలాడ వెంకట్, ఆడారి మంజు, దాడి ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎలమంచిలి మండలం పులపర్తి కాలువలతో చెత్తను తొలగిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత

▸▸ 'స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్'లో ఎమ్మెల్యే 'సుందరపు' పిలుపు



మునిసిపాలిటీలో స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్‌పై అవగాహన కార్యక్రమంలో చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

ఎలమంచిలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో అంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పులపర్తిలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలోని కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించి, పలు వీధులను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు తమ పరిసరాలతో పాటు వీధులు, కాలువలను శుభ్రం చేసుకునేందుకు ముందుకు రావాలన్నారు. ఇది సామాజిక బాధ్యతగా అంతా స్వీకరించాలని కోరారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు, కూటమి నాయకులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, అన్నం బాబ్జీ, బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. మునిసిపాలిటీలోని రాజీవ్‌గాంధీ మైదానంలో చైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ ప్రసాదరాజు, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తదితరులు శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, మునిసిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మునగపాక : పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఇక్కడి ప్రభుత్వ కార్యాలయాలు నుంచి మెయిన్ రోడ్డు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో కలిసి శ్రమదానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆది ఉమామహేష్, ఏవో ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావులతో పాటు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



మునగపాకలో ఎంపీడీవో, సిబ్బంది అవగాహన ర్యాలీ

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని మడుతూరు, తదితర గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పాఠశాలలు, బహిరంగ ప్రదేశాలను చీపుర్లతో శుభ్రం చేసి, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన కార్యదర్శి మోటూరు శ్రీవేణి గ్రామ పెద్దలు శనివాడ ఆనందరావు, సుంకర శ్రీనివాసరావు, దేశంశెట్టి సన్యాసినాయుడు, బుద్ద నరేష్, సాయిన అప్పారావు, మోటూరు చిరంజీవి, దేశంశెట్టి నూకరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే, మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల రిసోర్సు కార్యాలయ సిబ్బందితో అచ్యుతాపురంలో జంక్షన్ వద్ద పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు.

బైక్ మెకానిక్ నిజాయితీ

▸▸ బంగారంతో దొరికిన బ్యాగ్ పోలీసులకు అప్పగింత



బ్యాగ్‌ను పోగొట్టుకు మహిళకు అందిస్తున్న మెకానిక్ రాజు

అచ్యుతాపురం రూరల్, జనవరి 18, (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై కనిపించిన బ్యాగ్‌ను పోలీసులకు అప్పగించి ఓ బైక్ మెకానిక్ తన నిజాయితీని నిరూపించుకున్నాడు. మండలంలోని జంగుళూరుకు చెందిన బైక్ మెకానిక్ రాజు శనివారం ఉదయం తన పనుల నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో బ్యాగ్ కనిపించింది. వాహనాన్ని ఆపి చూడగా, అందులో తులం బంగారు చైన్‌తో పాటు రూ.1750 నగదు ఉన్నాయి. వెంటనే అచ్యుతాపురం పోలీసు స్టేషన్‌కు వెళ్లి సీఐ నమ్మి గణేశ్‌కు సదరు బ్యాగ్‌ను అందజేశారు. అయితే అప్పటికీ బ్యాగ్ పోయినట్టు పోలీస్ స్టేషన్‌కు ఎటువంటి ఫిర్యాదు అందలేదు. పోలీసులు విచారణ జరపగా అప్పికొండ గ్రామానికి చెందిన మైలపల్లి భారతి బ్యాగ్ పోయిందని తెలియడంతో ఆమెకు కబురు పంపారు. ఆమె రాగానే మెకానిక్ రాజు చేతుల మీదుగా ఆ బాగ్‌ను ఆమెకు అందజేశారు. రాజు నిజాయితీని సీఐ అభినందించడంతో పాటు రూ.ఐదు వందలను బహుమతిగా ఇచ్చారు. ఈ కార్యక్రమాలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపమాక క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

నక్కపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకున్నారు. కొండపై నున్న స్వామివారి నిజరూపానికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకం చేసి, ధూప,దీప నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కింద ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని పట్టుపీతాంబరాలు, పుష్పమాలలతో అలంకరించారు. భక్తుల గోత్ర నామాలతోఅర్చకులు పూజా కార్యక్రమాలు చేసి, తీర్థప్రసాదాలందజేశారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం



పూజలందుకుంటున్న స్వామివారు

నక్కపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డొంకాడ గ్రామంలో శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఏటా సంక్రాంతి తరువాత స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ముందుగా ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు, సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరంప్రత్యేకంగా నిర్మించిన వేదిక వద్ద స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాదాలందించారు.

'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్'పై అవగాహన



పాయకరావుపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

పాయకరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి: స్థానిక మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో స్వచ్ఛఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు, ఎంపీపీ కార్యాలయ ఏఓ సీహెచ్‌ఆర్‌కే.వర్మ తదితరులు పాల్గొని ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో చెత్తను శుభ్రం చేశారు.

నక్కపల్లి: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో సీతారామరాజు ఆధ్వర్యంలో శ్రమదానంతో ఆవరణను శుభ్ర పరిచారు. పెదబోదిగల్లం ముస్లిం గ్రామం, హెల్త్ సబ్ సెంటర్ వద్ద స్వచ్ఛభారత్ చేపట్టారు. ఎంపీడీవో సీతారామరాజు, సర్పంచ్ మున్నీషాబేగం తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: ప్రజలు భాగస్వామ్యంతోనే స్వచ్ఛ ఆంధ్ర సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు జానకీ శ్రీనివాసరావు అన్నారు.శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట పరిసరాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది శుభ్రం చేశారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథం, సర్పంచి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్. రాయవరం:మండల ప్రత్యేక అధికారి మనోరమ ఆధ్వర్యంలో స్థానికంగా ర్యాలీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, డీటీ నీరజ, టీడీపీనేత కందుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి రమేశ్‌బాబు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముద్దాయిలకు ఏడేళ్ల జైలు

పాయకరావుపేట రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరాంపురంలో 2011లో జరిగిన హత్యాయత్నం కేసులో నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష పడింది. దీనిపై స్థానిక సీఐ జి.అప్పన్న అందించిన వివరాలివి.. 2011 డిసెంబరు 3న శ్రీరాంపురంలో పులుగుల సన్యాసమ్మ ఇంటికి అదే గ్రామానికి చెందిన నలుగురువచ్చి పులుగు సత్యవతికి, సన్యాసమ్మ భర్త చంద్రరావు మధ్య వివాహేతర సంబంధం విషయమై గొడవపడి రాడ్డుతో దాడిచేసినట్టు అప్పటి ఎస్ఐ జి.ప్రేమ్‌కుమార్ కేసు నమోదైంది. ఈ కేసు విచారణ పూర్తయి నేరం రుజువు కావడంతో ముద్దాయిలు పులుగు సత్యవతి, పులుగు రాంబాబు, పులుగు బంగారి, పిల్లా ప్రసాదులకు ఎలమంచిలి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పి.విజయ ఒక్కొక్కరికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్టు సీఐ అప్పన్న తెలిపారు.



పాయకరావుపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తదితరులు



కోటవురట్ల: జల్లూరులో..



ఉపమాకలో నివాళులర్పిస్తున్న తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండబాబు

ఎన్టీఆర్ తెలుగుజాతి కీర్తి పతాక

▸▸ వాడవాడలా మాజీ ముఖ్యమంత్రి రామారావు వర్ధంతి

▸▸ టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘన నివాళి

పాయకరావుపేట/రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాయకరావుపేటలోని వై జంక్షన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు గొర్రెల రాజబాబు, బొంది కాశీవిశ్వనాధం, యాళ్ల వరహాలబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, చింతకాయల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. నామవరంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కంకిపాటి వెంకటేశ్వరరావు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. నాయకులు కురందాసు శివ, గొర్ల లక్ష్మీనారాయణ, బాబ్జీ పాల్గొన్నారు.సత్యవరం, పాల్తేరు, కుమారపురం, మంగవరం, అరట్లకోట, మాసాహెబ్‌పేట తదితర గ్రామాల్లో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి

కోటవురట్ల: ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాలకు ఆశా జ్యోతి అని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలంకాశీనాయుడు కొనియాడారు. శనివారం మండలంలోని జల్లూరు, కైలాసపట్నం, పాములవాక, బోడపాలెం శివారు కొత్తూరులలోని ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు నివాళర్పించారు. కైలాసపట్నంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షులు జానకీశ్రీనివాసరావు, పాములవాకలో వేచలపు జనార్దన్, భాస్కరరావు, కార్యదర్శి పెట్ల లింగంనాయుడు నివాళి అర్పించారు.

ఎన్టీఆర్ కారణజన్ముడు: తెలుగు రైతు నేత కొప్పిశెట్టి

నక్కపల్లి: ఎన్టీ రామారావు కారణజన్ములని టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొప్పిశెట్టి కొండబాబు అన్నారు. ఉపమాకలో రామారావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి శ్రీను, సర్పంచ్ ప్రగడ వీరబాబు, కనకరాజు, గోర్స సురేశ్, వంగలపూడి శ్రీను, చెల్లారావు పాల్గొన్నారు. నక్కపల్లిలో ఎన్‌టీఆర్‌కు టీడీపీ శ్రేణులు నివాళులర్పించారు.



ఎస్. రాయవరం: కొరుప్రోలులో నివాళులర్పిస్తున్న నేతలు

ఎస్. రాయవరంలో..

ఎస్. రాయవరం: టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం కొరుప్రోలులోని ఎన్‌టీఆర్ విగ్రహానికి స్థానిక నేత సత్యనారాయణతో కలిసి నివాళులర్పించారు. ఎస్ రాయవరంలో నేత కందుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. . రేవుపోలవరం, కోనవానిపాలెం తదితర గ్రామాల్లో ఎన్టీఆర్‌కు పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం రామకృష్ణ, మంచాల నానాజీ, కోడ లోవరాజు, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

నక్కపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానికఅంబేడ్కర్ గురుకులంలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సివుండగా, 211 మంది హాజరయ్యారు. పరీక్షల చీఫ్ సూపరిటెండెంట్ ఆర్ .నాగన్నదొర, ఉమ్మడి జిల్లా పరీక్షల నిర్వాహణాధికారి శ్రీధర్‌రెడ్డి, ఎంఈవోలు కె నరేశ్, వేమగిరి నూకరాజు పర్యవేక్షించారు.

పాయకరావుపేట: స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నవోదయపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ కేఎన్ సూర్యనారాయణ మాట్లాడుతూ, ఈ పరీక్షకు 281 మంది హాజరుకావాల్సి ఉండగా 191 మంది రాశారన్నారు.జి.సత్యనారాయణ, ఎంఈఓ-2 జి.రమేష్‌బాబు పరిశీలించినట్టు చెప్పారు.

ఎస్.నర్సాపురంలో 'సవిధాన్ గౌరవ్ దివస్'

పాయకరావుపేట రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్‌పై బీజేపీకి ఎంతో గౌరవమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ మేరకు సవిధాన్ గౌరవ్ దివస్ కార్యక్రమాన్ని శనివారం మండలంలోని ఎస్.నర్సాపురం ఎస్సీ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని మాసా చిన్నబ్బాయి స్వగృహంలో ఏర్పాటుచేసిన సహపంక్తి భోజనాల్లో కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీరంగం రమేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు మంచాల గాంధీ, నాయకులు కువల కుమార్ పాల్గొన్నారు.



ఎస్సీ కాలనీలో సహపంక్తి భోజనాలు చేస్తున్న బీజేపీ నాయకులు

'లోపాలు సరిదిద్దేందుకే భూ సర్వే'

పాయకరావుపేట రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు జి.సత్యనారాయణ తెలిపారు. శనివారం శ్రీరాంపురంలో నిర్వహించి గ్రామ సభలో ఆయన మాట్లాడారు. భూముల రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని 19 రెవెన్యూ గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో 16 గ్రామాల్లో రీ సర్వే జరిగిందన్నారు. మండలంలో మిగిలిన మూడు రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రీ సర్వే డీటీ రాజేంద్రప్రసాద్, సర్వేయరు శ్రీనివాస్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నక్కపల్లి: ఇటీవల జరిగిన భూముల రీ సర్వేలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తున్నట్టు ఆర్ఐ కన్నబాబు చెప్పారు. మండలంలోని గుల్లిపాడులో శనివారం భూముల రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ముందుగా అవగాహన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ, రీ సర్వేకు సంబంధించి పైలెట్ గ్రామంగా గుల్లిపాడును ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సత్తిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలోని చినబొడ్డేపల్లిలో ఈ నెల 19 నుంచి భూరీసర్వే నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ తిరుమల బాబు తెలిపారు. శనివారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచి శివ, మండల సర్వేయర్, ఆర్ఐ, వీఆర్‌వో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దారు సత్యనారాయణ


పరవాడ : వెన్నెలపాలెంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే బండారు నివాళి


అనకాపల్లి రింగురోడ్డు జనసేన కార్యాలయంలో పూలమాల వేస్తున్న రాంకీ


లక్ష్మీనారాయణనగర్ కాలనీలో దాడి రత్నాకర్ అంజలి


లంకెలపాలెం కార్యాలయంలో 79వ వార్డు కార్పొరేటర్ శ్రీనివాస్ నివాళి

తెలుగుజాతి కీర్తికిరీటం ఎన్టీఆర్

▸ వర్ధంతి సందర్భంగా కీర్తించిన వక్తలు ▸ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి ▸ పలుచోట్ల పండ్లు, దుస్తులు పంపిణీ

అనకాపల్లి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో శనివారం వాడవాడలా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు కూటమి శ్రేణులు పూలమాలలు వేసి అంజలి ఘటించి, పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలువురు వక్తలు మాట్లాడుతూ తెలుగు జాతి కీర్తికిరీటం ఎన్టీఆర్ అని అభివర్ణించారు. అనకాపల్లిలోని ఎన్టీఆర్ జంక్షన్, ఎన్టీఆర్ మార్కెట్ యార్డు, విజయరామరాజుపేట తదితర ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమాలకు అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బీమరశెట్టి రామకృష్ణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, మాదంశెట్టి నీలబాబు తదితరులు హాజరై ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీలా గోవింద మాట్లాడుతూ దేశంలోనే సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్‌గా పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కోరారు. టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ద, పీలా గోవింద, బత్తుల తాతయ్యబాబు, దాడి రత్నాకర్, కోట్ని బాలాజీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మీనారాయణనగర్ పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు బొద్దపు ప్రసాద్, పోలారపు త్రినాథ్, బొలిశెట్టి శ్రీనివాసరావు, సబ్బవరపు గణేశ్, సిరసపల్లి సన్యాసిరావు, బుద్ద భువనేశ్వరరావు, కుప్పిలి జగన్మోహనరావు, బోడి వెంకటరావు, బుద్ద కాశీ, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. తుమ్మపాలలో టీడీపీ మండల నాయకుడు కొణతాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బవులవాడ, దర్జీనగర్ కాలనీల్లో గల ఎన్టీఆర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే పీలా పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నడిపల్లి గణేష్, ఆకుల శ్రీనివాసరావు, గొర్లి శ్రీనివాసరావు, కోట్ని బాలాజీ, బత్తుల రమేష్, కోట్ని ఈశ్వరరావు, పచ్చికూర రాము, చెక్కల శ్రీనివాసరావు, తోటాడ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కశింకోటలో గల ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీమరశెట్టి రాంకీ పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, గ్రామ గ్రామాన ఈ కార్యక్రమన్ని నిర్వహించారు. కూటమి నేతలు గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళీ, ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపి, సిద్దిరెడ్డి శ్రీను, కాండ్రేగుల సతీష్, తాకాశి కృష్ణ, ఎస్.కె.బాబర్ తదితరులు పాల్గొన్నారు.


కశింకోటలో ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న పీలా, తదితరులు


పరవాడలో వృద్దులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న గండి బాబ్జీ


సబ్బవరంలో వృద్దులకు రగ్గులు పంపిణీ చేస్తున్న గండి వంశీదీప్

కొత్తూరు : అనకాపల్లిలోని రింగురోడ్డులో గల జనసేన కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీమరశెట్టి రాంకీ పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకుపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. పిసినికాడ పంచాయతీ రామభద్రపురంలో టీడీపీ నాయకులు వేగి వెంకట్రావు, మళ్ళ శ్రీనివాసరావు, కోన శ్రీను తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బుద్ద నాగజగదీశ్

పరవాడ : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పరవాడ సంతబయలు వద్ద గల ఆయన విగ్రహానికి టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండిబాబ్జి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీలు మాదంశెట్టి నీలబాబు, మాసవరపు అప్పలనాయుడు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, చింతకాయల ముత్యాలు, బొండా తాతారావు తదితరులు పాల్గొన్నారు. వెన్నెలపాలెంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, వెన్నెల ఏకుల అప్పారావు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, లోకిరెడ్డి అభి సన్యాసినాయుడు, బోజంకి నాయుడు, పైలా వరలక్ష్మి పాల్గొన్నారు. తానాంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లంకెలపాలెం : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు యర్రా కోటేశ్వరరావు, రామారావు, గుర్రం నాయుడు, దాముర్తి అర్జున్, విరోతి మణికంఠ, భరత్, చిన్నారావు, దేముడు, కరణం అప్పారావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఎన్టీఆర్ వర్ధంతిని మండల వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు నిర్వహించారు. ఇందులో భాగంగా సబ్బవరంలో ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ కుమారుడు, టీడీపీ నేత గండి వంశీదీప్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు భరణికాన బాబూరావు, గండి దేముడు, పీబీవీఎస్ఎన్ రాజు, గండి ముత్యాలనాయుడు, దాసరి రమణ, దొడ్డి ప్రకాశ్, పల్ల తాతారావు, బర్ల రమణ తదితరులు పాల్గొన్నారు. 88వ వార్డు పరిధి వెదళ్లనరవలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఉరుకూటి శ్రీనివాసరావు, బలిరెడ్డి అప్పలరాజు, డిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో పూర్తి ఆరోగ్యం

▸ 'స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్'లో అధికారులు


వైద్యాలయం ఆవరణను శుభ్రం చేస్తున్న డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు


వైద్యాలయ ఆవరణను చీపుర్లతో శుభ్రం చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్, సిబ్బంది


సబ్బవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో పద్మజ, సిబ్బంది

అనకాపల్లి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ వైద్యాలయంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది చీపుర్లు చేతబట్టి పరిసరాలను శుభ్రపర్చారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తి, పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తే వ్యాధులు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, వైద్యాలయంలోని మహిళా విభాగం ఆవరణలో డీఎంహెచ్‌వో డాక్టర్ పడాల రవికుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వైద్యులు, సిబ్బంది కలిసి పరిసరాలను తీర్చిదిద్దారు. అదేవిధంగా ఆర్టీసీ డిపో ఆవరణలో ఇన్‌చార్జి డీఎం రవిచంద్ర ఆధ్వర్యంలో డిపో పరిసర ప్రాంతాలను శుభ్రపర్చారు.

సబ్బవరం : స్వచ్ఛ గ్రామాల సాకారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో పి.పద్మజ పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం నుంచి సంత బయలు వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఏవో శివరామప్రసాద్, వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ బి. చైతన్య, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష


బాలుర పాఠశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

పరవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగింది. మొత్తం 186 మంది విద్యార్థులకు గాను 149 మంది హాజరైనట్టు ఎంఈవో దివాకర్‌రావు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

'కార్యాచరణ ద్వారా కుష్టు వ్యాధి నివారణ చర్యలు'

అనకాపల్లి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం అధికారులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా టీబీ, కుష్టు నివారణాధికారి డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ మాట్లాడుతూ కుష్టు వ్యాధిని తొందరగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. బహుళ ఔషధ చికిత్స కీలక భూమిక పోషిస్తుందని వివరించారు. పది వేల జనాభాకు ఒక్క కేసుకన్న తక్కువ నమోదు కావడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పడాల రవికుమార్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్, ప్రశాంతి, ధాత్రిప్రియా, డాక్టర్ శ్రావణి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ బాలాజీ

52 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

తుమ్మపాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రేబాక పంచాయతీ కాపుశెట్టివాని పాలెంలో తుమ్మపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మంది గ్రామస్థులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిపారు. గొంతు, రొమ్ము, గర్భాశయ పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. ఇందుకు అగనంపూడి ఓమి బాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు సహకారం అందించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ నమిత, డాక్టర్ సునీత, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ షమీన్, సిబ్బంది పాల్గొన్నారు.


రేబాకలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బహిరంగ ప్రదేశాల్లో ఫార్మా వ్యర్థాల పారబోత

పరవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా బహిరంగ ప్రదేశాల్లో విడిచి పెడుతూ పర్యావరణానికి ముప్పు తెస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, డీవైఎఫ్ఐ నాయకుడు గల్లా భార్గవ్ డిమాండ్ చేశారు. తాడి శివాలయం సమీపంలో గల కొండ ప్రాంతంలో ఫార్మా వ్యర్థాలను పారబోసి వాటికి నిప్పు పెట్టిన విషయాన్ని శనివారం గుర్తించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంకీ యాజమాన్యం చెక్‌పోస్టులను సక్రమంగా నిర్వహించకపోవడం వల్లే ఫార్మా వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో దర్శనమిస్తున్నాయన్నారు. ఈ కారణంగా భూగర్భజలాలు కలుషితం కావడంతో పాటు ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు స్పందించి విచారణ వేగవంతం చేయాలని వారు కోరారు.


ఫార్మా వ్యర్థాలను పరిశీలిస్తున్న నాయకులు

రౌడీషీటర్లకు డీఎస్పీ శ్రావణి కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి హెచ్చరించారు. పటణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రౌడీషీటర్లతో సమావేశమై వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎక్కడైనా గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఉత్సవాల్లో కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదన్నారు. అలా ఎవరైనా పాల్పడితే జైలుకు పంపడం తథ్యమన్నారు. ఇప్పటికైనా ప్రశాంత వాతావరణంలో సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్ఐలు డి. ఈశ్వరరావు, అల్లు వెంకటేశ్వరరావు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలపాక సమీపంలో ద్విచక్ర వాహనం దగ్ధం

పరవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం దగ్ధమైన ఘటన మండలంలోని కలపాక బీసీ కాలనీ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలివి. కలపాక శివారు మూల స్వయంభూవరం గ్రామానికి చెందిన కాలపురెడ్డి సురేశ్ శనివారం ఉదయం ఆరు గంటలకు కలపాక బీసీ కాలనీ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. కాలనీ దాటి కొంత దూరం వెళ్లే సరికి వాహనం ఇంజన్ నుంచి మంటలు వ్యాపించాయి. వెంటనే బైక్‌ను ఆపి మంటను ఆర్పేందుకు ప్రయత్నించగా, క్షణల్లోనే మంటలు బైక్‌ను చుట్టిముట్టాయి. స్థానికులు అక్కడికి చేరుకునే లోపే దగ్ధమైంది. ఈ ప్రమాదం నుంచి సురేశ్ చాకచక్యంగా తప్పించుకున్నాడు.


మంటల్లో దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు గణేశ్

'టీచర్ల సమస్యలపై ఏపీటీఎఫ్ నిరంతర పోరు'

కొత్తూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని ఫెడరేషన్ అనకాపల్లి మండల శాఖ అధ్యక్షుడు కొణతాల గణేశ్ అన్నారు. శనివారం అనకాపల్లి పట్టణంలోని నర్సింగరావుపేటలో ఉపాధ్యాయులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు శ్రేణులంతా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు శివాజీ, జగదీష్, కన్నారావు, బలరాం, రాజేంద్ర, రిటైర్డ్ ఉపాధ్యాయులు సత్యం, సాంబమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా సీతారాముల తీర్థాలు

కశింకోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోగారావుపేట, తీడ, గొబ్బూరు గ్రామాల్లో సీతారాముల తీర్థం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. జోగారావుపేట లో సీతారాములను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీమరశెట్టి రాంకీ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు గంగ శ్రీనివాసరావు, పువ్వుల సన్యాసిరావు, నాగేశ్వరరావు, నాగ చిరంజీవి, జగత గోవింద, శ్రీనివాసు, నాగేశ్వరరావు, కర్రి సత్యనారాయణ, దాడి నాగరాజు, మణికంఠ, గొంతిన ఈశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెం, గుల్లేపల్లి, పైడివాడఅగ్రహారం, ఇరువాడ గ్రామాల్లో సీతారామల తీర్థాలు నేత్రపర్వంగా సాగాయి. ఉదయం ఆరు గంటల నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్‌లు బోకం స్వామినాయుడు, బండారు మంగ, బలిరెడ్డి లక్ష్మి, గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, బండారు శ్రీను, అక్కిరెడ్డి దుర్గినాయుడు, రామలక్ష్మి, కోన సత్యనారాయణ, బలిరెడ్డి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.


జోగారావుపేటలో సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

తుమ్మపాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకే ముఖ్యమంత్రి సహాయ నిధిని సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో గోపాలపురం గ్రామానికి చెందిన జెర్రిపోతుల సూరిబాబుకు మంజూరైన రూ.లక్షా పదమూడు వేల పైచిలుకు చెక్కును శనివారం అందజేసి మాట్లాడారు. నాయకులు సిరసపల్లి సన్యాసిరావు, కరణం రమణ, జెర్రిపోతుల నూకరాజు, సిరసపల్లి సన్యాసిరావు, పీలా లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ వినియోగం తగ్గించాల్సిన బాధ్యత అందరిది'


శివాజీపార్కులో మొక్కకు నీరుపోస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, చిత్రంలో మేయర్, కమిషనర్

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వల్ల భవిష్యత్తు బంగారు బాట అవుతుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం శివాజీ పార్కులో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి పరిశుభ్రత చాలా అవసరమని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం సమాజానికి తీవ్ర హాని కలిగిస్తుందన్నారు. వాతావరణ కాలుష్యం నిరోధానికి ఇళ్లు, కార్యాలయాల ఆవరణ, మిద్దెలపై మొక్కలు పెంచాలని కోరారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ నగరాన్ని తమ సొంత ఇంటిలా పౌరులు భావించాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. ప్రతి వార్డులోనూ పరిశుభ్రత పోటీలు నిర్వహించి, అత్యంత స్వచ్ఛత గల వార్డులో రూ. 5లక్షల రూపాయలతో అదనపు పనులు ఆ వార్డులో చేస్తామని అన్నారు. ప్రజల సహకారంతోనే పరిశుభ్రత సాధ్యమని జీవీఎంసీ కమిషనర్ అన్నారు. ప్రతి వ్యక్తి స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే ఏదైనా సాధ్యమని అన్నారు. శివాజీ పార్కులో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద అధికారులు ఫొటోలు తీయించుకున్నారు. అదనపు కమిషనర్‌లు రమణమూర్తి, సోమన్నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


అరకులో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దొన్నుదొర, నేతలు


హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఐటీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి జ్యోతికిరణ్

రాజకీయ చైతన్యమూర్తి ఎన్టీఆర్

» విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర
» ఘనంగా ఎన్టీ రామారావు 29వ వర్ధంతి

అరకులోయ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన మహానేత, పేదలపెన్నిధి మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర అన్నారు. తెలుగు దేశం పార్టీ వ్యవస్థాకుడు నందమూరి తారకరామారావు 29వ వర్ధంతిని అరకులోయ దొన్నుదొర స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి దొన్నుదొర, నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం దొన్నుదొర మాట్లాడుతూ రాజకీయ చైతన్యం కలిగించిన గొప్ప నాయకుడు చైతన్యమూర్తి ఎన్టీఆర్ అని అన్నారు. తెలుగు జాతి ఉన్నంతవరకు ఎన్టీఆర్ జీవించే ఉంటారన్నారు. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి అద్భుత విజయాన్ని సాధించారన్నారు. పేదలకు మేలు చేకూర్చే సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఇందిరాగాంధీ వం టి నియంతను ఎదిరించి విజయం సాధించిన ఏకైక వ్యక్తిగా నిలిచారన్నారు. ఢిల్లీలో ఆంధ్రుల గొంతును వినిపించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, పెదలబుడ సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, నాయకులు సుంకరమెట్ట మాజీ సర్పంచ్ పెట్టెలి రాము, వైస్‌సర్పంచ్ విజయనిర్మల చందు, పద్మాపురం మా జీ సర్పంచ్‌లు మహాదేవ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన మహోన్నత నేత..

కొయ్యూరు: పేదల అభ్యున్నతే ధ్యే యంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకే దక్కుతుందని టీడీపీ నేత, జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎన్టీఆర్ 29వ వర్ధం తిని ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజేంద్ర పాలెం, రేవళ్ల సర్పంచులు పి. సింహాచలం, జె వెంకటలక్ష్మి, నాయకులు బఖీర్‌ఖాన్, దుచ్చరి, అప్పలరాజు, చిన్న ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు,మేడిబోయిన చిన్న, కాకురు చంద్రరావు, బాస్కర రావు పాల్గొన్నారు. అ నంతరం 200 చీరలను పేదలకు పంపిణీ చేశారు. మాల మాకవరంలో పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రామ్మూర్తి ఆధ్వరంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు జి. సత్యనారాయణ పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు సేవలు చిరస్మరణీయమని టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. శనివారం స్థానిక పాత బస్టాండ్ టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావులు, ఆమె ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పూర్ణచం ద్రరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. అలాగే, రాష్ట్రానికి సమర్థవంతమైన సీఎం నారాచంద్రబాబు నాయుడు ఒక్కరేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లంగి లక్ష్మణరావు పాల్గొన్నారు.


చింతపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


అనంతగిరిలో...

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: ఎన్టీఆర్ తెలుగు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. స్థానిక కిడారి భవనంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు మాట్లాడారు. రూపాయికి కిలో బియ్యాన్ని పేదలకు అందించి వారికి అండగా నిలిచారన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గీత, మాజీ ఎంపీపీ దన్నెరావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, చినగెన్ను తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో ఘన నివాళి

సీలేరు: స్థానిక మార్కెట్ సెంటర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు బొర్ర కృష్ణ, కె. సన్యాసిరావు, వార్డు సభ్యుడు చిటికెల రాము, గోవిందులు ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.


పాడేరులో విగ్రహం ఎదుట నాయకులు


కొయ్యూరు: పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ప్రసాద్ తదితరులు


సీలేరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతగిరిలో..

అనంతగిరి: మండల కేంద్రంలో ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు ఆధ్వర్యంలోని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ కె.అప్పారావు, మహిళా కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బూర్జ లక్ష్మి, సర్పంచులు జన్ని అప్పారావు, భీమ్మలమ్మ, దొన్ను పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు:మండల కేంద్రంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి గడ్డంగి రామ్మూర్తి, సర్పంచి వి.లక్ష్మణ్, నాయకులు కె.జగత్‌రాయ్, మాజీ సర్పంచి వి.రామస్వామి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించిన పాడేరునేతలు

పాడేరురూరల్: ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన ఘాట్ వద్ద శనివారం ఐటీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ద జ్యోతికిరణ్ నివాళులర్పించారు.

పాడేరులో..

పాడేరురూరల్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 29వ వర్ధంతి కార్యక్రమాన్ని పాడేరులో శనివారం ఘనంగా నిర్వహించారు. పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ఆయన వి గ్రహానికి నివాళులర్పించారు. అనంతరం శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, పేదల కోసం ఆవిర్భవించిన పార్టీ తెలుగుదేశం అన్నారు. ఆ పార్టీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరింత ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. పేదలకు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం ఈశ్వరి ఆధ్వర్యంలో నాయకులు జిల్లా ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. మాజీ మంత్రి మణికుమారి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు బొర్రా నాగరాజు, కొట్టగుళ్లి సుబ్బారావు, పాడేరు సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి తదితరులు పలుచోట్ల ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. నాయకులు ఎంపీపీ ఎస్.రత్నకుమారి, వైస్ఎంపీపీ గంగపూజారి శివకుమార్, టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, మాజీ ఎంపీపీ ఎస్‌వీవీ.రమణమూర్తి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వి.కాంతమ్మ, రొబ్బి రాము, డప్పోడి వెంకటరమణ, డుంబేరి విశ్వనాథం, కూడా శ్రీలక్ష్మి, ఎం.బాలరాజు, లకే పార్వతమ్మ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకుడు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.


పాడేరు ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

నేడు మోదకొండమ్మ తీర్థ మహోత్సవం


విద్యుద్దీపాల అలంకరణలో ఆలయ సముదాయం


ముస్తాబైన అమ్మవారు

పాడేరురూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు స్థానిక మోదకొండమ్మ తీర్థ మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి విగ్రహం, ఆలయానికి విద్యుత్ అలకంరణ పనులను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు పర్యవేక్షణలో శనివారం సాయంత్రానికి పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మమణ్యం శర్మ తెలిపారు. 10 గంటలకు ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహంతో నేల డ్యాన్స్‌లు, తీన్‌మార్ బ్యాండ్, బాణ సంచాతో ఊరేగింపు చేపట్టనున్నారు. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ కార్యదర్శి కోటిబాబు కోరారు.

ప్రైవేటు బస్సుకు తప్పిన ప్రమాదం


బ్రేకులు ఫెయిల్ కావడంతో బొర్రా రైల్వేగేటు సమీపంలో బండరాయి ఢీకొట్టి నిలిపివేసిన బస్సు

అనంతగిరి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రా రైల్వేగేటు సమీపంలోని శనివారం ఓ ప్రైవేటు బస్సుకు పెను ప్రమాదం తప్పింది... గోపాలపట్నం వద్ద యల్లపువానిపాలెంకు చెంది ఒకే కుటుంబానికి చెందిన సుమారు 40 మంది వరకు బొర్రా అందాలను తిలకించేందుకు, ప్రైవేటు బస్సులో బొర్రాకు బయలుదేరారు. రైల్వేగేటు సమీపంలోని మలుపువద్దకు వచ్చేసరికి బస్సు బ్రేక్ ఫెయిలయింది.. గమనించిన డ్రైవర్ చాక్యచక్యంగా వ్యవహరించి, బండరాయిని ఢీకొట్టి బస్సును నిలిపివేశారు. దీంతో ప్రమాదం తప్పడంతో ప్రయాణికులంతా ఊపిరిపీల్చుకున్నారు. గతంలో ఇదే ప్రాంతంలోని జరిగిన ప్రమాదాల్లో పలువురు మృత్యువాతపడ్డారు..

బైక్ బోల్తా.. ఇద్దరికి గాయాలు



పెదబయలు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పెదబయలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారంజరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కొరవంగిలో సం క్రాంతి పం డగ ముగియడంతో ద్విచక్ర వాహనంపై పొయిబ సాంబ బొండా మహీంద్ర (9) బొండా భరత్ (6) పెదకోడపల్లి పంచాయితీ కోడపుట్ స్వగ్రామానికి బయలు దేరారు. చుట్టు మెట్ట దాటిన తరువాత మంగబంద సమీపంలో రోడ్డుపై గోతుల్లో పడి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వీరికి గాయాల య్యాయి. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న ఎం పీడీవో పూర్ణయ్య స్పందించి 108 అంబులెన్స్‌కి సమాచారమిచ్చారు. వాహన సిబ్బంది వచ్చి పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు. క్షతగాత్రులను వైద్యాధికారులు నిఖిల్,చైతన్యలు ప్రథమ చికిత్స అందించారు. సాంబ, భరత్‌లకు బలమైన గాయాలవడంతో మెరుగైన చికిత్సకు పాడేరులో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

తగ్గని సంక్రాంతి ప్రయాణికుల రద్దీ


ప్రయాణికులతో రద్దీగా ఉన్న పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్

పాడేరురూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పాడేరు ఆర్టీసీ డిపోలో సంక్రాంతి తిరుగు ప్రయాణీకుల రద్దీ కొనసాగుతోంది. మైదాన ప్రాంతంలో నివసించే గిరిజన ప్రాంత వాసులు సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో కలిసి స్వ గ్రామాలకు వచ్చారు. వారు తిరిగి మైదాన ప్రాంతాలకు తరలివెళ్తుండటంతో గత మూడు రోజుల నుంచి పాడేరు ఆర్టీసీ, కాంప్లెక్స్ జీపుల స్టాండ్ ప్రయాణీకులతో రద్దీగా మారాయి. శనివారం మైదాన ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ కిటకిటలాడాయి.

వారపు సంతలో పోలీసులు గస్తీ

ముంచంగిపుట్టు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గస్తీ నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ పోలీసులు సంత నలుమూలలతిరుగుతూ ఏరియా డామినేషన్ చేశారు. సంత ముగిసే వరకు నాలుగు రోడ్ల కూడలిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చే వాహనాలపై, వెళ్లే వాహనాలపైన ప్రత్యేక దృష్టి సారించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

» గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ రజని

ముంచంగిపుట్టు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ బాధ్యత అని గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ, మండల ప్రత్యేక అధికారి రజని అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిపై మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. పలు వీధులను అధికారులు, సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఆరుబయట చెత్త వేయరాదని సూచించారు. వీధుల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అధికారులు కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసుబాబు, ఈవోపీఆర్‌డీవో చిన్నాన్న, మండల పరిషత్, సచివాలయం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాచార పౌరసంబంధాల కార్యాలయంలో..

పాడేరురూరల్:జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వారి కార్యాలయంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి పి.గోవిందరాజులు మాట్లాడుతూ ప్రతీ నెల 3వ శనివారం అధికారులు, సిబ్బంది అంతా కలిసి కార్యాలయ పరిసరాలను శుభ్రపరచాలని కోరారు. అనంతరం సిబ్బందితో కలిసి స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పీఆర్‌వో పండు రాములు, సీనియర్, జూనియర్ సహాయకులు పి.శ్రీనివాసరావు, కె.సంధ్యారాణి, టైపిస్ట్ ఈ.శ్రీనివాసరావు, రికార్డ్ అసిస్టెంట్ కె.మోహన్‌రావు, ఆఫీస్ సబార్డినేట్లు గమ్ బహదూర్, పి.వరలక్ష్మి పాల్గొన్నారు.


చింతపల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో 'స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేశారు. ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీధర్, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు ధారలక్ష్మి, నాయకులు బుజ్జిబాబు, చిరంజీవి, నాగ భూషణం పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి సర్పంచి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి జగ్గునాయుడు, కార్యదర్శి విజయ్‌కుమార్, ఎం. స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో అధికారులు,ప్రజా ప్రతినిధులు స్వచ్ఛత హీ సేవా కార్య క్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ రంగారావు ఆధ్వర్యంలో వీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు.అనంతరం ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి పరిశుభ్రతపై నినాదాలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టులో డీడీ రజని ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ


పాడేరు డీపీఆర్‌వో కార్యాలయ ఆవరణలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది


పెదబయలులో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


డుంబ్రిగుడ: పోతంగిలో గాంధీ చిత్రపటానికి నివాళర్పిస్తున్న దృశ్యం

ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గల ఆపరేషన్ థియేటర్‌లో ఖాళీగా ఉన్న ఐదు టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ఈ నెల 25వ తేదీలోగా ప్రభుత్వ వైద్య కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్.హేమలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల, పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వివిధ భాగాలలో 244 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వ కళాశాలల సంచాలకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. అందులో పాడేరు ఆసుప త్రిలో ఆపరేషన్ థియేటర్‌లో 5 టెక్నీషియన్ పోస్టులు ఉన్నాయన్నారు. వీటికి ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ప్రభుత్వ వైద్య కళాశాల పాడేరులో దరఖాస్తులు అందించాలని ఆమె కోరారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

చింతపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు 173మంది విద్యార్థులు హాజరయ్యారు. శనివారం ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ పరీక్ష జరిగింది. కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాలకు చెందిన 253మంది హాజరుకావాల్సి ఉండగా, 80మంది గైర్హాజరయ్యారు. పరిశీలకుడు కాల్యాణ్ కృష్ణ, ఎంఈవో-1,2లు వీబీవీవీవీ ప్రసాద్, గెమ్మెలి బోడం నాయుడు కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు.

పులి సంచారంపై వదంతులు

సీలేరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సీలేరు వాసులు పులి భయంతో వణికిపోతున్నారు. శనివారం గ్రామ పరిసరాల్లోకి పులి వచ్చిందంటూ ప్రచారం జరగడంతో ఆందోళనకు లోనయ్యారు.

ఈ విషయం తెలిసిన వెంటనే అటవీశాఖ అధికారులు పులి జాడపై ఆరా తీస్తున్నారు. శనివారం మధ్యాహ్న సమయంలో విశాఖ నుంచి భద్రాచలం వస్తున్న బస్సు సీలేరు చేరుకోగానే స్థానికంగా ఉన్న అటవీశాఖ కూపీలో పులి కనిపించినట్టు బస్సులోని ప్రయాణికులు చెప్పారు.

దీంతో ఆ నోటా, ఈ నోటా ఈ విషయం సీలేరు మొత్తంగా పాకింది. ఈ విషయంపై బస్సు డ్రైవర్ మాత్రం తాను చూడలేదని, ప్రయాణికులు చూసినట్టు చెప్పారు. వెంటనే అటవీశాఖ సిబ్బంది హుటాహుటిన కూపీ ప్రాంతానికి చేరుకుని పులి జాడపై ఆరా తీశారు. సుమారు 10 మంది సిబ్బంది వెతికినా, ఆనవాళ్లు దొరకలేదు.

అయితే, దీనిపై రేంజి అధికారి వెంకటరావు, డిప్యూటీ రేంజి అధికారి సింహాచలం పడాల్ మాట్లాడుతూ.. ఇది వట్టి పుకారుగానే భావిస్తున్నామని తెలిపారు. అయినా, పులి ఆచూకీకి సిబ్బంది వెతుకుతున్నారన్నారు.

చోడవరంలో అరుదైన జాతి కప్ప

చోడవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా చోడవరం ఏడమ్స్ స్కూల్ వద్ద శనివారం అరుదైన జాతి కప్ప కనిపించింది. ఇది తెలుపు, గోధుమ వర్ణంలో ఉంది. ఈ కప్పను శ్వేత మండూకంగా పిలుస్తారని పాఠశాల బయాలజీ ఉపాధ్యాయురాలు పూర్ణిమా ఫాల్గున్ తెలిపారు. దీని శాస్త్రీయ నామం 'చిరోమేంటిస్ గ్జీరాంపేలినా' అని, ఇది రేకో ఫోరిడే కుటుంబానికి చెందినదని చెప్పారు. దక్షిణాఫ్రికాలో ఎక్కువగా ఉండే ఈ జాతి కప్పలు మొక్కలు, చెట్ల కొమ్మలపైనే నివసిస్తాయన్నారు. ఈ కప్పను విద్యార్థులు, సందర్శకుల కోసం స్కూల్‌లోనే ఉంచామని ప్రిన్సిపాల్ రజిత తెలిపారు.


ఏడమ్స్ స్కూల్ వద్ద కనిపించిన అరుదైన కప్ప

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చోడవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కింద నియోజక వర్గంలోని 21 మందికి రూ.8.9 లక్షల రూపాయల సహాయాన్ని శనివారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అందించారు. తన చాంబర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ మొత్తాన్ని చెక్కులు రూపంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగురైతు ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, జనసేన నేత ఎస్.రమేశ్, టీడీపీ నాయకులు డి.వెంకట అప్పారావు, ఎస్.కోటీశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాయపురాజుపేటలో గుర్రం పరుగు పోటీలు

చోడవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేటలో భూలోక మాత అమ్మవారి జాతర సందర్భంగా శనివారం గుర్రం పరుగు పోటీలు నిర్వహించారు. పోటీల్లో రాయపురాజుపేటకే చెందిన మోదమాంబసాయి, దాడి నూకహనుమంత రావులకు చెందిన గుర్రాలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించగా, తృతీయ స్థానంలో దేవరాపల్లికి చెందిన నవీన్ గుర్రం నిలిచింది. నాయకులు బి.గంగాధర్, రామునాయుడు విజేతలకు బహుమతులు అందచేశారు.

'డిప్యూటీ సీఎం కృషి ఫలితమే స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ'

గొలుగొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి ఫలితంగానే స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిందని జనసేన పార్టీ నర్సీపట్నం ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. గొలుగొండలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంపై డిప్యూటీ సీఎం ఒత్తిడి తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండెం దొరబాబు, కోనా నారాయణరావు, బోయిన చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కె.కోటపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సోమవారం నుంచి నిర్వహించనున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని ప్రాంతీయ పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు (ఏడీ) డాక్టర్ దినేశ్‌కుమార్ సూచించారు. పశువులకు, లేగదూడలకు, గొర్రెలు, మేకలు, కోళ్లకు టీకాల కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

నర్సీపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా పరిషత్ హైస్కూల్ (మెయిన్)లో 146, జడ్పీహెచ్ పాఠశాల (తురకబడి)లో 148, జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 146, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 127 విద్యార్థులు పరీక్షలు రాశారని చెప్పారు. 774 మంది దరఖాస్తు చేసుకోగా, 567 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. నవోదయ ప్రిన్సిపాల్ వైఎస్.చంద్రశేఖర్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మోహనరావు, ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, పాఠశాల హెచ్ఎం పద్మావతి ఆధ్వర్యంలో నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన అధికారితో పాటు 15 మంది ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

కాలువ ఆక్రమిత స్థలం పరిశీలన

రోలుగుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొట్టివారి వీధిలో కాలువ ఆక్రమిత స్థలాన్ని మండల ప్రత్యేకాధికారి మనోహర్ అధికారులతో కలిసి పరిశీలించారు. 'కాలువను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి' అనే శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. ఈ మేరకు శనివారం కాలువ ఆక్రమిత ప్రాంతాన్ని సందర్శించారు. కాలువకు అడ్డంగా వేసిన మట్టి, సిమ్మెంట్ రేకులను పరిశీలించారు. తక్షణమే ఆక్రమణలు తొలగించాలని, కాలువ ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

డోలీలో ఆస్పత్రికి వృద్ధుడు



రావికమతం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చలిసింగం గ్రామానికి చెందిన వెలం భీమరాజు(62) అస్వస్థతకు గురవ్వడంతో డోలి మోతలో తరలించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. శనివారం సీకేపాడు గ్రామంలో ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గిరిజనులకు రగ్గులు పంపిణీ చేశారు. చలిసింగంకు చెందిన భీమరాజు ఈ కార్యక్రమంలో పాల్గొని తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే సహచర గిరిజనులు డోలి కట్టి కాలినడకన చలిసింగం చేర్చారు. కొండపై ఉన్న ఈ గ్రామానికి పక్కా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఫలితంగా ఈ గ్రామానికి చెందిన గిరిజనులు అత్యవసర చికిత్స అందాల్సి ఉన్నప్పుడు డోలి మోతలు తప్పడం లేదు.



నాతవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న విజయ్, నాయకులు



రావికమతం: కొత్తకోటలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే



కె.కోటపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

వాడవాడలా ఎన్టీఆర్‌కు ఘన నివాళి

నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. వాడవాడలా ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

చోడవరం/రావికమతం/రోలుగుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చోడవరంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాల సాధనకు ప్రతీ కార్యకర్త కట్టుబడి ఉండాలని, ఆయన స్థాపించిన తెలుగుదేశం పార్టీ జెండా ప్రజలకు అండగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే మండలంలోని పలు పంచాయతీల్లో జరిగిన కార్యక్రమాల్లో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, మాజీ ఎంపీపీ పెదబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, నాయకులు ఎస్.రమేశ్ డీవీ.అప్పారావు, ఎస్.కోటేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, పాలెం నాయుడు, ఎలకా మల్లిబాబు, జి.సుధాకర్, ఈర్లె శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి చిన్న, ఎన్.హరి పాల్గొన్నారు.

రావికమతం మండలం కొత్తకోట, జెడ్.కొత్తపట్నం గ్రామాల్లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, నాయకులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు జాతి గుండె చప్పుడు ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ అధ్యక్షురాలు కె.నీలవేణి, మండల అధ్యక్షుడు ఆర్.కొండనాయుడు, విశాఖ డైరీ డైరెక్టర్ జి.సత్యనారాయణ, కోట గోవిందరావు, కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, వెల్లంకి ఈశ్వరరావు, గంజి మోదునాయుడు, వేపాడ నాగేశ్వరరావు, ఉప్పులూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. రోలుగుంటలో ఉప సర్పంచ్ సుర్ల నరిసింహమూర్తి, పాలసంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఐటీడీపీ మండల ఇన్‌చార్జి బి.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు బంటు చిరంజీవి, గండి తాతాజీ, గండి సింహాద్రి, రొంగలి రమణ పాల్గొన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గంలో...

నర్సీపట్నం/మాకవరపాలెం/నాతవరం/కృష్ణాదేవిపేట: కోటి సభ్యత్వాలతో ఎన్టీఆర్‌కు నారా లోకేశ్ నివాళులర్పించారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. శనివారం పీనారిపాలెం, ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి ఎన్టీఆర్ పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మాకవరపాలెం మండలం తామరంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్వై పాత్రుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. తూటిపాల, బూరుగుపాలెం, చామంతిపురం, మల్లవరం, గిడుతూరు లచ్చన్నపాలెం గ్రామాల్లో పార్టీ మండల ఉపాధ్యక్షుడు చిరంజీవి, నాయకులు ఎ.రామునాయుడు, ఓ.గోవింద, రమణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి జరిగింది.

కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, సిహెచ్‌నాగాపురం, కొంగశింగి, చోద్యం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో కార్యకర్తలు నడవాలని ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ తారకవేణుగోపాల్ కోరారు. సర్పంచ్ ఎ.గోపాలకృష్ణ, నాయకులు కె.అప్పారావు, కె.రామారావు, బొడ్డు జమీలు, గొంప వాసు, పి.నారాయణమూర్తి, బి.పాపారావు, బి.ప్రసాద్ పాల్గొన్నారు. నాతవరంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల విజయ్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను అందరూ కొనసాగించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎన్.వెంకటరమణ, తాండవ చైర్మన్ కె.సత్యనారాయణ, కూటమి నాయకులు పి.కొండబాబు, ఎన్.విజయ్‌కుమార్, ఎ.మాణిక్యం, యర్రా సూర్యనారాయణ, సీతారామ్మూర్తి, శెట్టి లోవ, కె.మరిడియ్య, బి.సూరిబాబు, ఎ.యర్రాపాత్రుడు, నానాజీ పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గంలో...

కె.కోటపాడు/చీడికాడ/దేవరాపల్లి: కె.కోటపాడు మూడు రోడ్ల జంక్షన్‌లో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, నాయకులు డి.నరసింహమూర్తి, ఎస్.రామునాయుడు, కె.భాస్కర్‌రావు, బి.నరసింహనాయుడు, జూరెడ్డి రాము, కె.లక్ష్మీనారాయణ, పి.నారాయణమూర్తి, పి.శ్రీను, ఉ.బ్రహ్మాజీ, బి.దేముడుబాబు, బి.ప్రసాద్, ఎల్.అవతారం, ఎల్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చీడికాడలో టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, ఖండివరంలో మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, ఎస్‌వీఎస్.నాయుడు, దిబ్బపాలెంలో ఎంపీటీసీ సభ్యుడు డి.పెద్దినాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు జి.సత్యనారాయణరాజు, నాయకులు పి.రమణమ్మ, జి.ముసలినాయుడు, పి.కొండబాబు, కె.సూరినాయుడు, బి.దయాకర్, ఎస్.శివ పాల్గొన్నారు. దేవరాపల్లిలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మొల్లి.కృష్ణమూర్తి, ఎన్.గజపతినగరంలో టీడీపీ మండల అధ్యక్షుడు సిహెచ్.సూర్యనారాయణ, రైవాడ జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, తమడాన ప్రసాద్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఉత్సాహంగా 'స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్'

నర్సీపట్నం/చోడవరం/రావికమతం/చీడికాడ/కృష్ణాదేవిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం ఉత్సాహంగా సాగింది. నర్సీపట్నంలో కమిషనర్ సురేంద్ర ఆధ్వర్యంలో ఇందిరా మార్కెట్, పెదబొడ్డేపల్లి రైతుబజార్, శారదానగర్ బైపాస్ రోడ్డు, డంపింగ్ యార్డు, నర్సీపట్నం శ్మశానవాటిలో స్థానిక భాగస్వామ్యంతో శుభ్రం చేయించారు. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, ఆర్డీవో వి.వి.రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

చోడవరం పట్టణ శివారు రేవళ్ల గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించి ర్యాలీలో అధికారులతో పాటు పాల్గొన్నారు. ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో పీఎస్‌జే ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ మహేశ్, జనసేన నేతఎస్.రమేశ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రావికమతం మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పైల రాజు మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుపర్చేందుకు ప్రజల భాగస్వామ్యం కావాలని, అందరూ సహకరించాలని కోరారు. ప్రతి నెలా మూడో శనివారం పారిశుధ్య కార్మికులు, గ్రామాల ప్రజలు తమ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

కృష్ణాదేవిపేట అటవీ కార్యాలయంలో చెత్తాచెదారాన్ని సేకరించి పరిసరాలు శుభ్రపరిచారు. ఈ సందర్భంగా అటవీ శాఖ రేంజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి సత్యనారాయణ, గొలుగొండ సెక్షన్ అధికారులు లక్ష్మణ్, రమణ, గార్డులు గొరేశు, గణపతి, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడలోని తురువోలు గ్రామంలో ఉద్యోగులు, ప్రజా ప్రతినిధుల కలిసి స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్‌పై ర్యాలీలు చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ప్రజా భాగస్వామ్యంతోనే పరిశుభ్రతకు అవకాశం ఉంటుందని మండల ప్రత్యేకాధికారి వీఎస్ఎల్ఎన్.మూర్తి అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమ సుంద్రరావు, కార్యదర్శి నాయుడు, సర్పంచ్ ఎం.అప్పారావు, ఉప సర్పంచ్ పిటి.బాబు, ఎంపీటీసీ బి.కోటేశ్వరరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.





చోడవరం: రేవళ్లలో ర్యాలీ చేస్తున్న రాజు, అధికారులు... నర్సీపట్నం: గాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో, కమిషనర్



కృష్ణాదేవిపేటలో పారిశుధ్య కార్యక్రమం చేపడుతున్న అధికారులు

మహిళా మార్ట్ పేరుతో దోపిడీ ఆపండి

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

మాకవరపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల సభ్యుల నుంచి మహిళా మార్ట్ పేరుతో జరుగుతున్న దోపిడీని ఆపాలని సభ్యులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రుత్తల లక్ష్మి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వెలుగు ఏపీఎం మాట్లాడుతూ డ్వాక్రా సంఘలాకు స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ వంటి రుణాలు అందిస్తామని చెబుతుండగా, జెడ్.గంగవరం సర్పంచ్ రమణ అడ్డు తగిలారు. మహిళా మార్ట్ పేరుతో డ్వాక్రా సభ్యుల వద్ద దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా పొదుపు ఖాతాల నుంచి ప్రతీ సభ్యురాలు రూ.3 వేలు తీసుకొని మహిళా మార్ట్‌లో సరకులు కొంటేనే బ్యాంకు రుణాలు మంజూరు చేస్తామని బెదిరిస్తుండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహిళా మార్ట్‌లో సరకులు కొనలేదని తమ బంధువుల సంఘానికి బ్యాంకు రుణం ఇవ్వలేదని సమావేశం దృష్టికి తీసుకున్నారు. మహిళా మార్ట్ పేరుతో పొదుపు రుణాల నుంచి నగదును కాజేస్తున్నారని, ఈ దోపిడీని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. దీనికి ఏపీఎం స్పందిస్తూ, సంఘం సభ్యులు మహిళా మార్ట్‌లో సరకులు కొనుగోలు చేయాలనే నింబంధన ఏమీ లేదని స్పష్టం చేశారు. అలా జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో రేషన్ సరకులు సరఫరా చేసేటప్పుడు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు తెలపాలని రాచపల్లి ఎంపీటీసీ సభ్యుడు ఆర్వై.పాత్రుడు కోరారు. అనంతరం ఏవో చిరంజీవి మాట్లాడుతూ ఈ ఏడాది 600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇంతవరకు 300 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని చెప్పారు. అలాగే మండలంలోని పది సాగునీటి సంఘాల పరిధిలో ఉన్న కాలువలు, గ్రోయిన్లు, మదుముల మరమ్మతుల కోసం రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ జేఈ రామన్నపాత్రుడు చెప్పారు. ఈ ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా పనులు ప్రారంభిస్తున్నట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వరలక్ష్మి తెలిపారు. పలు శాఖల అధికారుల శాఖల వారీగా సమాచారం తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ రాజారావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో జాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో వెలుగు ఏపీఎంను ప్రశ్నిస్తున్న జెడ్.గంగవరం సర్పంచ్

గోవాడ షుగర్స్ కార్మికుల ఆందోళన విరమణ



ఆందోళన విరమిస్తున్నట్టు ప్రకటిస్తున్న నాయకులు

చోడవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వేతన బకాయిలు, అలవెన్సుల కోసం ఆందోళనకు దిగిన గోవాడ గుర్తింపు కార్మిక సంఘం నేతలు ఆందోళన విరమించి శనివారం నుంచి విధులకు హాజరయ్యారు. బకాయిలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు వారం రోజులుగా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే రాజు ఫ్యాక్టరీలోని రెండు కార్మిక సంఘాల నేతలతో పాటు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్థిక వనరులు సమకూరిన తరువాత కార్మికుల బకాయిలు రెండు, మూడు రోజుల్లో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే రాజు సూచన మేరకు శనివారం ఫ్యాక్టరీ ఆవరణలో భాస్కరరావు, రామునాయుడుల ఆధ్వర్యంలోని సంఘాల కార్మిక నేతలతో పాటు, కార్మికులు సమావేశమయ్యారు. అనంతరం ఎమ్మెల్యే హామీ మేరకు ఆందోళన విరమించి విధులకు హాజరుకావాలని నిర్ణయించినట్టు గుర్తింపు కార్మిక సంఘం నేత కేవీవీఎస్ భాస్కరరావు తెలిపారు.

తాండవకు పూర్వ వైభవానికి కృషి

నాతవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తాండవకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం నీటి సంఘాల అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తాండవ అభివృద్ధిని గాలికొదిలేసిందన్నారు. తాండవ డామ్‌పై మొక్కలు ఎండిపోయాయని, పార్కు అధ్వానంగా తయారైందని చెప్పారు. తాండవ రిజర్వాయర్ అభివృద్ధి పనుల కోసం రూ.13.72 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని చెప్పారు. వచ్చే ఖరీఫ్‌కు తాండవ చివరి భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో తాండవ చైర్మన్ ఎన్నికలు నిర్వహించలేదన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం రూ.2400 కోట్లతో ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఈ సమావేశంలో తాండవ ఈఈ బాల సూర్యం, డీఈఈ అనురాధ, తాండవ కమిటీ ప్రతినిధులు ఎల్.బాబులు, ఎం.జోగిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్.వెంకటరమణ, నాయకులు విజయ్‌కుమార్, పి.కొండబాబు, ఎ.మాణిక్యం కె.నూకరాజు, మరిడేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల అనుపు ఉత్సవం



గౌరీ పరమేశ్వరులకు పూజలు చేస్తున్న గ్రామస్థులు

రావికమతం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినపాచిల గ్రామంలో శనివారం గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం అంబరాన్ని తాకింది. సర్పంచ్ కె.రామలక్ష్మి, ఉప సర్పంచ్ కె.శంకరావు, గ్రామస్థులు రచ్చబండ సమీపంలోని కమ్యూనిటీ హాలులో నెలకొల్పిన గౌరీపరమేశ్వర్లలను సుమారు రెండు నెలల పాటు ప్రతి రోజూ ప్రత్యేకంగా పూజలు చేశారు. శనివారం నిర్వహించిన అనుపు మహోత్సవంలో భక్తులు అమ్మవారికి సారె ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు.

గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం, ముషిడిపల్లి, కలిగొట్ల గ్రామాల్లో ఘనంగా తీర్థ మహోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు గ్రామ దేవతలను దర్శించుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, సర్పంచ్ ఎ.వరలక్ష్మి, జి.రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల నిమజ్జనం

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలం చోద్యం గ్రామంలో శనివారం గౌరీపరమేశ్వరుల నిమర్జన కార్య క్రమం ఘనంగా జరిగింది. సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు పిండి వంటలతో కూడిన సారెను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారిని ప్రతిమను నిమ జ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఎ.కోమలి, ప్రభాకరరావు, టీడీపీ నాయకులు దేవాడ శేషు, స్వామినాయుడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

పశువుల్లో వ్యాధుల నివారణకు చర్యలు

-టి.పుష్ప, ఏడీ, పశు సంవర్థక శాఖ



పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలోని రావికమతం, రోలు గుంట మండలాల్లో గొర్రెలు, మేకలు, లేగదూడలకు నట్టల నివారణ చర్యలు చేపడతున్నాం. అలాగే గ్రామాల్లో ఎప్పటికప్పుడు పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: ఎప్పటి నుంచి పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తారు?

జవాబు: రావికమతం, రోలుగుంట మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తాం.

ప్రశ్న: ఈ శిబిరాల ద్వారా పశువులకు ఏ విధమైన వైద్య సేవలు అందిస్తారు?

జ: పశువులు, దూడ పెయ్యలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు అందించడంతో పాటు గొర్రెలు, మేకలకు, కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తాం.

ప్రశ్న: ఎదకు రాని పశువులకు ఏం సేవలు అందిస్తారు?

జ: పశువులు అనారోగ్యంతో ఉండి ఎదకు రాకపోయినా, గర్భకోశ వ్యాధులు ఉన్నా ఉచితంగా చికిత్సలు నిర్వహిస్తాం. అవి ఎదకు వచ్చేలా తగిన చికిత్స చేస్తాం.

ప్రశ్న: పశు వైద్య శిబిరాల్లో ఎంత మంది, ఏ స్థాయి వైద్యులు, సిబ్బంది పాల్గొంటారు?

జ: ప్రతీ మండలంలో రోజుకు రెండు గ్రామాల చొప్పున పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. ఈ శిబిరాల్లో రెండు వైద్య బృందాలు పాల్గొంటారు. ఒక్కొక్క శిబిరంలో పశు వైద్యాధికారితో పాటు పశు వైద్య సేవ సహాయకుడు, రైతు సేవా కేంద్రం సహాయకులు వైద్య బృందంతో కలిసి సేవలు అందిస్తారు. ఈ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

-రావికమతం, ఆంధ్రజ్యోతి

భూముల రీ సర్వేపై అవగాహన ర్యాలీలు

మాకవరపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేపై శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మండలంలోని లచ్చన్నపాలెం గ్రామంలో రెవెన్యూ అధికారులు ఈ కార్యక్రమం చేపట్టారు. 'సర్వే చేయించుకోండి.. మీ భూములను కాపాడుకోండి' అనే నినాదాలపై ర్యాలీ సాగించారు. సోమవారం నుంచి నిర్వహించనున్న రీ సర్వేకు రైతులు సహకరించాలని ఈ సందర్భంగా డీటీ సోమశేఖర్ కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతల రామలక్ష్మి, టీడీపీ సీనియర్ నేత పోతల రాంబాబు, రీ సర్వే డీటీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం: మండలంలోని పెద్ద బైరవ భూపతి అగ్రహారం గ్రామంలో రీ సర్వేపై తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ ఆధ్వర్యంతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే చేసుకుంటే సరిహద్దు వివాదాలు ఉండవన్నారు. అలాగే రైతుల భూమి వివరాలు పూర్తిగా తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివ, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన భూ రీ సర్వేను సద్వినియోగపర్చుకోవాలని తహసీల్దార్ లక్ష్మీదేవీ కోరారు. మండలంలోని తెనుగుపూడి గ్రామంలో శనివారం రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో జరిగిన రీ సర్వేలో లోపాలు ఉంటే సరిచేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు, సచివాలయ సర్వేయర్ మురళి, రెవెన్యూ సిబ్బంది నాయుడు, పెంటకోట అప్పలనాయుడు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

నాతవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లేడిపూడి గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు ఎస్‌ఐ సిహెచ్.భీమరాజు శనివారం బహుమతులు అందించారు. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన అనూష, లోవమ్మకు బహుమతులు ప్రదానం చేశారు. ఇలాంటి పోటీలు ఏర్పాటు చేయడం మంచి పరిణామమని ఈ సందర్భంగా ఎస్‌ఐ అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లాలం రమణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కోరుప్రోలు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

కె.కోటపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ గ్రామంలో ఆదివారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో జరగనున్న ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చే రోగులు ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డులు తీసుకురావాలని ఆయన సూచించారు.

సోషల్ మీడియాలో సత్తా చూపుతున్నారు

ఉద్యోగం/వ్యాపారం చేసుకుంటూనే సామాజిక మాధ్యమాల్లో రాణించే యత్నం

» విశాఖకు చెందిన పలువురికి లక్షల్లో ఫాలోవర్స్/సబ్‌స్ర్కైబర్స్

» ఆదాయం రావడంతో పాటు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు అవకాశం లభిస్తుండడమే కారణం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరానికి చెందిన మత్స్యకార యువకుడు నాని కొన్నాళ్ల కిందట సరదాగా యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించాడు. సముద్రంలో వేటకు వెళ్లినప్పటి నుంచి వచ్చేంత వరకూ ఏం చేస్తారో వీడియోలు తీసి యూట్యూబ్‌లో పెట్టడం ప్రారంభించాడు. సముద్రంలో వేట, ప్రయాణం వంటివి వీక్షకులకు నచ్చడంతో సబ్‌స్ర్కైబర్స్ భారీగా పెరిగారు. అతను ఇప్పటివరకూ 663 వీడియోలను అప్‌లోడ్ చేయగా, ప్రస్తుతం 2.23 లక్షల మంది సబ్‌స్ర్కైబర్లు ఉన్నారు.



లోకల్‌బాయ్ నాని



అమ్మచేతి వంట... భార్గవి



ధరణి గుడ్ల

నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నల్లా శరత్, నిషా దంపతులు ఈ మధ్యకాలంలోనే ఇన్‌స్టా రీల్స్ చేయడం ప్రారంభించారు. ఇంట్లో భార్యాభర్తల మధ్య సరదాగా జరిగే సంభాషణలను ఇతివృత్తంగా తీసుకుంటూ వీక్షకుల మనసులను దోచుకుంటున్నారు. ఇప్పటివరకూ శరత్, నిషా దంపతులు 135 వీడియోలను అప్‌లోడ్ చేయగా, 1.53 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ప్రతి వీడియోకు వేలల్లో వ్యూస్ వస్తున్నాయి.

'అమ్మ చేతి వంట' పేరుతో 2017లో భార్గవి అనే ఆమె యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించారు. ప్రతిరోజూ భిన్నమైన వంటలను చేస్తూ వీడియోలను అప్‌లోడ్ చేస్తారు. ఈ వీడియోలకు భారీగా వ్యూస్ వస్తున్నాయి. ఇప్పటివరకూ అమ్మ చేతి వంట యూట్యూబ్ ఛానెల్‌లో 1,500 వీడియోలు అప్‌లోడ్ చేయగా, 3.49 మంది సబ్‌స్ర్కైబర్లు ఉన్నారు. ఒక్కో వీడియోకు లక్షల్లో వ్యూస్ చేస్తుంటాయి. ఇన్‌స్టాలోనూ ఆమె అకౌంట్‌ను 2.05 లక్షల మంది ఫాలో అవుతున్నారు.

నగరానికి చెందిన గుడ్ల ధరణి ఇదే పేరుతో ఇన్‌స్టా అకౌంట్‌ను రన్ చేస్తున్నారు. ఈ అకౌంట్‌లో మార్కెట్‌లోకి కొత్తగా వచ్చే డ్రెస్‌లు, చీరల గురించి చెప్పడంతోపాటు మహిళలకు సంబంధించిన ఇతర వస్తువుల గురించి తెలియజేస్తుంటారు. కొత్త సినిమా పాటలకు డ్యాన్స్ కూడా చేస్తుంటారు. ఇప్పటివరకూ ఆమె 1,670 వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయగా, 4.05 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ప్రతి వీడియోకు వేలల్లో వ్యూస్ వస్తున్నాయి.



నల్లా శరత్, నిషా దంపతులు

సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు ఇతర ప్లాట్‌ఫామ్స్‌పై సత్తా చాటుతున్న నగరవాసుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి వీడియోకు లక్షల్లో వ్యూస్ వచ్చే యూట్యూబర్స్/ఇన్‌స్టా క్రియేటర్స్ ఎంతోమంది ఉన్నారు. వ్యూస్‌ను బట్టి ఆదాయం కూడా వస్తుండడంతో రోజులో కొంత సమయాన్ని వాటికి కేటాయిస్తున్నారు. ఆదాయంతో పాటు తమను తాము నిరూపించుకునేందుకు సామాజిక మాధ్యమాన్ని ఎంచుకుంటున్నట్టు పలువురు చెబుతున్నారు. ఇలాంటి వారిలో విభిన్న రంగాలు, వయసులు, వృత్తులవారు ఉంటున్నారు. బలమైన కోర్కె, అందుకు అనుగుణమైన నాలెడ్జ్, కొంత శ్రమించే గుణం ఉంటే చాలు...ఎవరైనా ఇందులో రాణించేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

ఇవి ఉంటే చాలు..

యూట్యూబర్, ఇన్‌స్టా క్రియేటర్‌గా రాణించాలంటే కొన్ని వస్తువులు ఉంటే సరిపోతుంది. మంచి క్వాలిటీతో వీడియోలు తీసేందుకు అనుగుణమైన ఫోన్/ కెమెరా ఉండాలి. మరొకరి సహాయంతోగానీ ఒక్కరేగానీ వీడియోలు తీసుకోవచ్చు. ఇందుకోసం స్టాండ్‌తోపాటు మరికొన్ని వస్తువులు ఉం డాలి. అలాగే వీడియో ఎడిటింగ్, స్పెషల్ ఎఫెక్ట్ ఇచ్చే నాలెడ్జ్ ఉండాలి. ఒక్కరే వీడియోలను తీసి అప్‌లోడ్ చేసుకోవచ్చు.

భారీగానే ఆదాయం

సామాజిక మాధ్యమాల్లో అకౌంట్ ఓపెన్ చేసిన తరువాత అప్‌లోడ్ చేసే ప్రతి వీడియోకు భారీగా వ్యూస్ రావు. ఇందుకోసం చాలా శ్రమించాల్సి ఉంటుంది. వీక్షకులు అభిరుచులకు అనుగు ణంగా కంటెంట్‌తో కూడిన వీడియోలు చేస్తేనే వ్యూస్ వస్తాయి. యూట్యూబ్ మాత్రమే వీడియోలకు వచ్చిన వ్యూస్, చూసిన నిడివి వంటి అంశాలను పరిశీలించి కొంత మొత్తాన్ని చెల్లిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్/యూట్యూబ్‌లలో ఫాలోవర్స్ పెరిగితే స్థానికంగా వ్యాపార సంస్థలు, ఉత్పత్తులను ప్రమోట్ చేయడం ద్వారా ఆదాయం సంపా దించవచ్చు. కనీసం లక్ష మంది సబ్‌స్ర్కైబర్లు/ ఫాలోవర్లు ఉన్న వారికి స్థానికంగా మంచి డిమాండ్ ఉంటోంది. వారి వీడియోల్లో తమ ఉత్పత్తులను ప్రమోట్ చేయించుకునేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు.


టాలెంట్ హంట్..

సామాజిక మాధ్యమాల వల్ల ఎంతోమందికి మేలు కలుగుతోంది. అదనపు ఆదాయాన్ని సంపాదించుకునే అవకాశం లభించడంతో పాటు తమలోని ప్రతిభను బయట ప్రపంచానికి తెలియజేసేందుకు ఉపయోగపడుతున్నాయి. అయితే కొన్ని రకాల ఇబ్బందులు కూడా ఉన్నట్టు యూ ట్యూబర్స్ చెబుతుంటారు. ఫాలోవర్స్‌ను సంపాదించడం ప్రస్తుతం కష్టంగా మారుతోంది. ఇందుకోసం తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. ఆదరణ లేకపోయినా, నెగెటివ్ కామెంట్లు వచ్చినా కొంతమంది డిప్రెషన్‌లోకి వెళ్లిపోతుంటారు. అలాంటి వాటి విషయంతో తగిన జాగ్రత్తలతో ముందుకువెళ్లాల్సి ఉంటుంది.

నెలకు 25 వీడియోలు అప్‌లోడ్

» పెట్ల కిరణ్‌కుమార్, ఫుడ్ లవర్స్ గ్యాంగ్ యూట్యూబ్ ఛానెల్

అప్పట్లో హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో మాత్రమే ఫుడ్ ఛానెల్స్ ఉండేవి. ఏపీలో రుచులను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో 2019లో ఛానెల్ ప్రారంభించాను. 'ఫుడ్ లవర్స్ గ్యాంగ్' అనే పేరు పెట్టాను. ఇప్పటివరకూ 1500 వీడియోలు అప్‌లోడ్ చేశాను. ప్రస్తుతం యూట్యూబ్‌లో 4.34 లక్షల వరకు సబ్‌స్ర్కైబర్లు ఉన్నారు. ఇన్‌స్టాలో మూడు లక్షల వరకు ఫాలోవర్స్ ఉన్నారు. ఐదు రాష్ట్రాల్లో భిన్నమైన ఆహార పదార్థాలను వీక్షకుల దృష్టికి తెచ్చాను. నెలకు కనీసం 25 వీడియోలు అప్‌లోడ్ చేస్తాను. ఒక్కో వీడియోకు కనీసం ఆరు గంటలు శ్రమిస్తాను. షూటింగ్‌కు నాలుగు గంటలు, ఎడిటింగ్‌కు రెండు గంటలు పడుతుంది.



పెట్ల కిరణ్‌కుమార్

ప్రొటోకాల్‌పై జడ్పీలో రగడ

... 5వ పేజీ తరువాయి

పెంటకోట సత్యనారాయణ, ధూళి నాగరాజు ఫిర్యాదు చేయడంపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఎస్ఈ శ్రీనివాసరావు స్పందిస్తూ అనకాపల్లి ఈఈకి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని, నెల రోజుల్లో పనులు ప్రారంభించే ఏర్పాట్లు చేస్తామన్నారు. పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఒక్కొక్కసారి ఒకో పార్టీ అధికారంలో ఉంటుందని పేర్కొంటూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరగా చైర్‌పర్సన్ జోక్యంచేసుకుని ఎలమంచిలిలో పనులు ప్రారంభించాలని, లేకపోతే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఎస్ఈ, అనకాపల్లి ఈఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. జడ్పీ కోఆప్షన్ సభ్యుడు కుమార్ లేచి పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావును చూసి ఇప్పుడు 'రెడ్‌బుక్.. త్వరలో గుడ్‌బుక్ వస్తోంది...దాంట్లో మీ పేర్లు ఉంటాయి' అని బెదిరించారు. కాగా సీఈవో పి.నారాయణమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 19 అతిథి గృహాలు ఉన్నాయని, అయితే చాలా వరకు శిథిలావస్థకు చేరుకోవడంతో నిరుపయోగం ఉన్నాయని వెల్లడించారు. తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సగటున ప్రతి అతిథి గృహం కోసం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. తరువాత నిర్వహణ బాధ్యతలు సంబంధిత ఎంపీడీవోకు అప్పగించి ఏడాదికి లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు కేటాయిస్తామన్నారు. విశాఖ నగరంలో అప్పుఘర్ వద్ద ఉన్న అతిథి గృహంలో రెండో అంతస్థు నిర్మాణంలో బిల్లుల మంజూరుపై కాంట్రాక్టరు కోర్టుకు వెళ్లగా గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్థులు మరమ్మతులు చేస్తామన్నారు. ఈ దశలో పరవాడ జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజు మాట్లాడుతూ డిమాండ్ ఉన్న చోట ప్రైవేటు వ్యక్తులకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఇదే వేదికపై తొలుత స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించి సవరించిన, అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. బడ్జెట్ సమావేశం కావడంతో ఇతర అంశాలపై వివరంగా చర్చించేందుకు మూడు జిల్లాల కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులు హాజరు కాలేదని, అందువల్ల సమస్యలపై చర్చకు మరోసారి సమావేశం ఏర్పాటుచేయాలని పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు సుంకరి గిరిబాబు కోరగా, మిగిలిన సభ్యులు మద్దతు పలికారు. సమావేశానికి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్ హాజరయ్యారు.

నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుతో కాలుష్యం పెరుగుతుందని నక్కపల్లి, అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు కాసులమ్మ, గంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పార్కు ఏర్పాటుకు పంచాయతీ, మండల పరిషత్ సమావేశాల్లో తీర్మానాలు చేసి ఆమోదించలేదన్నారు. గతంలో కాకినాడ దరి తొండంగి వద్ద ఏర్పాటుకు ప్రతిపాదిస్తే స్థానికులు అడ్డుకున్నారని గుర్తుచేశారు. నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేయవద్దని పేర్కొంటూ చైర్‌పర్సన్‌కు వారు వినతిపత్రం అందజేశారు.

జడ్పీ బడ్జెట్ రూ.1,586.08 కోట్లు

... 5వ పేజీ తరువాయి

చూపించారు. అదేవిధంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1589.13 కోట్లు ఆదాయంగా, రూ.1586.08 కోట్లు వ్యయంగా అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. అంచనా బడ్జెట్‌లో వ్యయం కంటే ఆదాయం రూ.3.05 కోట్లు అధికంగా ఉండడంతో దానిని మిగులుగా చూపించారు. ఆదాయపరంగా చూస్తే జిల్లా పరిషత్‌కు వచ్చే సాధారణ నిధులు, కేంద్రం మంజూరుచేసే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.48.83 కోట్లు, ఇతర శాఖలు అంటే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పశు సంవర్థక, మత్స్యశాఖల నుంచి రూ.1322.76 కోట్లు పొందుపరిచారు. సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.46.78 కోట్లు ఇతర శాఖలకు సంబంధించి రూ.1539.30 కోట్లు వ్యయంగా చూపించారు. బడ్జెట్‌పై సభ్యులు చర్చించి అనంతరం ఆమోదం తెలిపారు. త్వరలో ప్రభుత్వ ఆమోదానికి పంపుతామని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి వెల్లడించారు.

కలహాల కాపురాలకు కౌన్సెలింగ్

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేసింది. ఆమె భర్తను పిలిపించి అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ తరహా వేధింపులు వల్ల జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించడంతోపాటు న్యాయపరంగా ఉన్న చిక్కులను వివరించారు. అదే సమయంలో ఇద్దరి మధ్య ఉన్న కొన్నిరకాల అపోహలు, అంతరాలను తొలగించి, కలిసి ఉండేలా చేశారు. ప్రస్తుతం ఇద్దరూ ఆనందంగా గతంలో మాదిరిగా జీవనాన్ని సాగిస్తున్నారు.

..చిన్న చిన్న కారణాలతో విడిపోయేందుకు ఈ మధ్య కాలంలో ఎందరో దంపతులు సిద్ధమవు తున్నారు. కొన్ని కేసుల్లో భర్త తప్పు ఉంటే.. మరికొన్ని కేసుల్లో భార్య తప్పు ఉంటోంది. ఇద్దరూ కూర్చుని పది నిమిషాలు మనసు విప్పి మాట్లాడు కుంటే సమసిపోయే దానికి....ఇగోలకు పోతున్నారు. ఇటు వంటి ఎన్నో సమస్యలకు కౌన్సెలింగ్ ద్వారా పరిష్కార మార్గాలను చూపించి ఏకం చేస్తున్నారు ఎంవీపీ కాలనీలోని డొమెస్టిక్ వయొలెన్స్ సెల్ అధికారులు. కట్నం, లైంగిక వేధింపులు, అనుమానాలు, అపోహలు వంటి కారణాలు/ గొడవలతో విడిపోయేందుకు సిద్ధమై వస్తున్న జంటల మనసులను మార్చి వైవాహిక జీవితాన్ని కొనసాగించేలా కృషిచేస్తున్నారు.

గతంతో పోలిస్తే పెరుగుదల..

భార్యాభర్తల మధ్య గొడవలకు అనేక అంశాలు కారణమవుతున్నాయి. కట్నం, పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలంటూ వేధింపులకు సంబం ధించి ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. అలాగే అనుమానాలు, అపోహలు, మనస్పర్థలు, సెల్‌ఫోన్ తెచ్చిన చిక్కులతో కూడిన కేసులు కూడా ఉంటున్నాయి. చాలామంది తాము విడిపోతామని, కలిసి ఉండలేని పరిస్థితికి చేరామంటూ అధికారులు వద్దకు వస్తున్నారు. వీరి సమస్యను సావధానంగా వింటున్న అధికారులు ఇరువర్గాలను కూర్చోబెట్టి కౌన్సెలింగ్ నిర్వహించి కలిసి ఉండేలా చేస్తున్నారు. గతంతో పోలిస్తే కౌన్సెలింగ్‌తో కలిసి ఉండేందుకు సిద్ధమవుతున్న జంటల సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

గడిచిన ఏడాది కాలంలో మొత్తం 3,716 కేసులు నమోదు కాగా, వీటిలో ఇప్పటివరకూ 474 కేసులను కౌన్సెలింగ్ ద్వారా అధికారులు పరిష్కరించారు. మరికొన్ని కేసులు కౌన్సెలింగ్ దశలో ఉన్నాయి. కొన్ని కోర్టు వరకు వెళ్లినట్టు అధికారులు చెబుతున్నారు. 1,104 కేసులు కోర్టుల్లో క్లియర్ అయ్యాయని, బాధితులకు నష్ట పరిహారాన్ని అందించేలా చేశామని అధికారులు వెల్లడించారు.

దఫదఫాలుగా చర్చలు

ఈ సెల్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితురాలితోపాటు ఇతర కుటుంబ సభ్యులు, భర్తతో అధికారులు దఫదఫాలుగా చర్చలు జరుపుతారు. భార్యాభర్తతోపాటు వారి కుటుంబ సభ్యులు, అవసరమైతే కొన్నిసార్లు ఆ ప్రాంతానికి చెందిన పెద్ద మనుషులను రప్పించి మాట్లాడ తారు. సమస్య ఎవరి వైపు ఉందో తెలుసుకుని వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. భార్యను వేధించడం తగదని, సర్దుబాటు చేసుకుని దాంపత్య జీవితం కొనసాగించాలని భర్తకు సూచిస్తారు. కాదు, కూడ దంటే చట్టపరంగా ఉన్న ఇబ్బందులను తెలియ జేస్తారు. మరోవైపు అమ్మాయిలో తప్పులు ఉంటే వాటిని గుర్తించి సరిచేసుకునేలా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. విడిపోతే ఎదురయ్యే ఇబ్బందులు, సమాజం ఎలా చూస్తుందన్న విషయాలను తెలియజేస్తారు. ఇరువురితో వేర్వేరుగా మాట్లాడి అన్ని అంశాలను కూలం కుశంగా వివరించి రాజీకి వచ్చేలా అధికారులు కృషిచేస్తున్నారు.

ఐదేళ్లలోపు జంటలే ఎక్కువ..

పెళ్లై ఐదేళ్లు కూడా కాని జంటలే ఎక్కువగా సెల్‌కు వస్తున్నాయి. తక్కువ వయసు కావడం, ఇగోలకు పోవడంతో సమస్య తీవ్రతరం అవు తోందని అధికారులు చెబుతున్నారు. కౌన్సెలింగ్ ద్వారా ఎంతో మంది వైవాహిక జీవితాలను నిలబట్టే ప్రయత్నం చేస్తున్నామని డీవీ సెల్ అధికారి జ్యోతి వెల్లడించారు. గతంతో పోలిస్తే రాజీకి అంగీకరిస్తున్న వారి సంఖ్య గడిచిన ఏడాది కొంత మెరుగ్గా ఉందన్నారు. ఇద్దరూ ఉద్యోగులైన జంటల్లో ఈ సమస్య కొంత అధికంగా ఉందని పేర్కొన్నారు.

ఐఎంయూ ఎదుట రైతుల ధర్నా

... 5వ పేజీ తరువాయి

ఇవ్వాలనే ప్లకార్డులు ప్రదర్శించారు. తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ధర్నా శిబిరాన్ని సందర్శించి, రైతుల సమస్యలు తెలుసు కున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఆయన చెప్పారు. రైతుల సమస్యలు ఉన్నతాధికారులకు తెలియచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

నర్సీపట్నం డీఎస్పీగా శ్రీనివాసరావు

నర్సీపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం డీఎస్పీగా పోతురెడ్డి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న మోహన్ రెండు నెలల క్రితమే ఇంటిలిజెన్సీ విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బొబ్బిలి డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాసరావుని నర్సీపట్నం బదిలీ చేశారు.



డీఎస్పీ పి.శ్రీనివాసరావు

సొంత గనులు కూడా సాధిస్తాం

... 5వ పేజీ తరువాయి

ఈ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించారన్నారు. ప్లాంటుకు అవసరమైన ఐరన్‌ఓర్ గనులు కూడా సాధిస్తామని ప్రకటించారు. కార్మికులు పట్టు వదలకుండా పోరాటం చేయడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ ప్లాంటుకు సొంత గనులు కూడా సాధించి విశాఖ ఉక్కును దేశంలో నంబర్‌వన్ స్థానంలో నిలిపేలా చేస్తామన్నారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంటు సమస్యపై అనేకసార్లు ప్రధాని మోదీతో పవన్ కళ్యాణ్ మాట్లాడారని, కూటమి నేతల కృషి వల్లనే అన్ని వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎంఎస్ఎంఈల కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్, పార్టీ నాయకులు కోన తాతారావు తదితరులు మాట్లాడారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. చివరిగా ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

వైసీపీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడిగా ధర్మశ్రీ

... 5వ పేజీ తరువాయి

గుడివాడ అమర్‌నాథ్‌ను, మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్తగా బూడి ముత్యాలనాయుడును, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా విజయనగరం జిల్లాకు చెందిన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా తిప్పల దేవన్‌రెడ్డిని నియమించింది.

వైభవంగా వేల్పులవీధి గౌరమ్మ ఉత్సవం



రథోత్సవాన్ని ప్రారంభించిన రామకృష్ణ, సురేంద్ర



ఆకట్టుకున్న కేరళ నృత్య ప్రదర్శన

అనకాపల్లి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేల్పులవీధి గౌరీ పరమేశ్వరులు అనుపు మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారుజామున మెయిన్‌రోడ్డులోని ఆలయంలో గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు దర్శనం కల్పించారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని పూజలు చేశారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ, హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ, పాత్రికేయుడు వీవీ రమణమూర్తి, కార్పొరేటర్ మందపాటి సునీత, జానకిరామరాజు, జాజుల ప్రసన్నలక్ష్మి, రమేశ్, మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి దంపతులు, పలువురు రాజకీయ పార్టీల నాయకులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. వీరిని ఉత్సవ కమిటీ ఘనంగా సత్కరించింది. ఉదయం తొమ్మిది గంటల సమయంలో ప్రత్యేక రథంపై గౌరీ పరమేశ్వరులను ఏర్పాటు చేశారు. రథోత్సవాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ, మళ్ల సురేంద్ర, వర్తకసంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణలు ప్రారంభించారు. అనంతరం పురవీధుల గుండా గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు కొనసాగింది. దారి పొడువునా భక్తులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకొని పూజలు చేశారు. ఉత్సవంలో భాగంగా ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన నేలవేషాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా పులివేషాలు, నవశక్తుల డ్యాన్స్, కోలాటాలు, కేరళ డ్యాన్స్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు డీఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో భారీ ఎత్తున బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పుల గణేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు, వేల్పులవీధి పెద్దల పర్యవేక్షణలో ఉత్సవం ఘనంగా సాగింది.

చోడవరంలో అరుదైన జాతి కప్ప

దక్షిణాఫ్రికాలో ఈ జాతి కప్పలు ఎక్కువ

చోడవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా చోడవరం ఏడమ్స్ స్కూల్ వద్ద శనివారం అరుదైన జాతి కప్ప కనిపించింది. ఇది తెలుపు, గోధుమ వర్ణంలో ఉంది. ఈ కప్పను శ్వేత మండూకంగా పిలుస్తారని పాఠశాల బయాలజీ ఉపాధ్యాయురాలు పూర్ణిమా ఫాల్గున్ తెలిపారు. దీని శాస్త్రీయ నామం 'చిరోమేంటిస్ గ్సీరాంపేలినా' అని, ఇది రేకో ఫోరిడే కుటుంబానికి చెందినదని చెప్పారు. దక్షిణాఫ్రికాలో ఎక్కువగా ఉండే ఈ జాతి కప్పలు మొక్కలు, చెట్ల కొమ్మలపైనే నివసిస్తాయన్నారు. ఈ కప్పను విద్యార్థులు, సందర్శకుల కోసం స్కూల్‌లోనే ఉంచామని ప్రిన్సిపాల్ రజిత తెలిపారు.



ఏడమ్స్ స్కూల్ వద్ద కనిపించిన అరుదైన కప్ప

జోరుగా కోడి పందేలు, గుండాటలు



గొబ్బూరులో కోడిపందేలు ఆడుతున్న దృశ్యం



పోలవరం కాలువ సమీపంలో గట్టు వద్ద లాటరీ గుండాట ఆడుతున్న దృశ్యం

కశింకోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొబ్బూరు గ్రామంలో కోడి పందేలు, లాటరీ గుండాటలు శనివారం జోరుగా జరిగాయి. గ్రామంలో సీతారాముల తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ శివారున పోలవరం కాలువ గట్టు సమీపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కోడి పుంజుల కాళ్లకు కత్తులు కట్టి మరీ కోడి పందేలు నిర్వహించారు. ఆ పక్కనే లాటరీ గుండాటలు నిర్వహించారు. పోలీసుల హెచ్చరికలను సైతం పట్టించుకోకుండా దర్జాగా వీటిని నిర్వహించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509